




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 349 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 22 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :349 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 22 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# ట్రాప్ & క్యాష్




పెన్ పవర్ EXCLUSIVE ప్రత్యేకం

- శానిటైజర్ షాపు నుంచి స్పా వరకు
- మొదట ట్రాప్ - తరువాత క్యాష్
- చక్రం తిప్పుతున్న ఓ ప్రజా ప్రతినిధి పి.ఏ.
- వ్యభిచారం, గంజాయి, బ్లాక్ మెయిల్, మట్టి మాఫియా, ఇవన్ని ఎవరి అండర్ కవర్‌లో ..?
- రాజకీయ నేతలతో స్నేహం... పోలీసుల నుంచి రక్షణ..!
- బ్లాక్ మెయిల్ బాబూ... వ్యాపారాలపె గూఢచారి కన్ను..?

**తాడేపల్లిగూడెం రసిక బాబు అసలు రూపం**

**రసిక బాబు మాస్టర్ ప్లాన్ చాలా సింపుల్. మొదట "ట్రాప్" – తరువాత "క్యాష్".**

**పెన్ పవర్ ఇన్వెస్టిగేషన్ టీమ్, తాడేపల్లిగూడెం నుంచి ఆగస్టు 21:**

తాడేపల్లిగూడెం పట్టణం కేవలం ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌లో ఒక బిందువే కాదు. అది ఒక మాఫియా కు డాన్ లా మారింది. రసిక బాబు అనే వ్యక్తి నెట్వర్క్ అంత చొచ్చుకుపోయింది %-% ఈ దందాలు రెస్టారెంట్ల నుంచి రిజిస్టర్ కార్యాలయ లేఖర్ల వరకు, పేకాట శిబిరాల నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వరకూ, ముసుగు వేరు - దందా వేరు. శానిటైజర్ షాప్‌లో కస్టమర్లకు గంజాయి ప్యాకెట్లు, బయట బెల్ట్ షాప్‌లకు రక్షణ వసూళ్లు, లోపల మహిళలతో వ్యభిచార వ్యాపారం -ఇదే అతని కదలికల జాబితా...

రెస్టారెంట్ యజమానులను ఇద్దరు యువతుల సహాయంతో బ్లాక్ మెయిల్ చేసి ఐదు లక్షలు వసూలు చేసిన ఘటన కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. పీఏ ల ద్వారా ఫోన్ కాల్స్ చేయించి యజమానుల మీద బలమైన ప్రెజర్ సృష్టించడం అతనికి అలవాటు. మద్యం షాపులు, బెల్ట్ షాపులు, డాబా లు, హెూటళ్లు - అన్నీ అతని వసూళ్ల టార్గెట్ లిస్ట్‌లో. "వ్యభిచారం నుంచి మట్టిమాఫియా దాకా - అన్ని రంగాల్లో రసిక బాబు ముద్ర ఉంటుంది" రసిక బాబు బిజినెస్ మోడల్ ఒక పిరమిడ్ లాంటిది - పైకి ఒకరు కనబడతారు కానీ కిందికి వెళ్తే ముఠాలు, నెట్వర్కులు వందలు.

వివరాలు 2లో..

## బనకచర్ల మరో కాళేశ్వరం అవుతుంది

**ఏపీ మాజీ మంత్రి సంచలన వ్యాఖ్యలు**



పెన్ పవర్ డెస్క్:ఏపీ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి డీఎల్ రవీంద్ర రెడ్డి బనకచర్ల ప్రాజెక్టుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. చాలా కాలం తర్వాత మీడియా ముందుకు వచ్చిన ఆయన సీఎం చంద్రబాబును ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు పేరు రావాలనే పోలవరం నుంచి బనకచర్ల ప్రాజెక్టు చేపట్టారని అన్నారు. పోలవరం బనకచర్ల మరో కాళేశ్వరం అవుతుందని అన్నారు డీఎల్. చంద్రబాబు రాజోలు నుంచి నీరు ఇస్తానని రూ. 3 వేల కోట్ల విలువైన హామీలు ఇచ్చారని అన్నారు. రాజోలుకు ఇచ్చే రూ. వెయ్యి కోట్లు లేనప్పుడు రూ.80 వేల కోట్ల బనకచర్ల ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు డీఎల్. రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన పనులు ఏమీ జరగడం లేదని అన్నారు. అలగనూరు ప్రాజెక్టు గురించి ఒప్పుకుంటామ

వివరాలు 2లో..

## నెలకొకసారి ఢిల్లీ వెళ్లి చంద్రబాబు ఏం సాధించారు..?



పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబుపై ఘాటైన వ్యాఖ్యలుచేశారు వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. కేంద్రం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయాలని చూస్తుంటే.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు నోరు మెదపడం లేదని అన్నారు. నెలకొకసారి ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు ఏం సాధించారని ప్రశ్నించారు బొత్స. రాష్ట్రంలో రైతులు, రైతుకూలీలు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు ఎవరూ బాగోలేరని అన్నారు. ప్రభుత్వ పెద్దలు అవినీతి, దోపిడీ, వ్యక్తిగత స్వార్థం తప్ప ఏమీ కనిపించడం లేదని అన్నారు బొత్స.ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచినా రైతు భరోసా, కేంద్రం సహాయంతో ఇస్తున్న రూ.20 వేలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంకా 70 నుంచి 80 వేల మందికి రైతు భరోసా అందలేదని అన్నారు. అన్నదాత సుఖీభవ సంవత్సరం పాటు గాలికి వదిలేసారని అన్నారు. అమ్మఒడి మేమేస్తే.. తల్లికి వందనం పేరు చెప్పి ఈరోజుకి కూడా 7 నుంచి 8 లక్షల మంది పిల్లలకు

వివరాలు 2లో..



## ఒక్కడినే వస్తా.. ఒంటరిగా పోరాడతా

**2026 ఎన్నికలపై విజయ్ సంచలన ప్రకటన..**

- వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేస్తా: విజయ్
- అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, టీవీకేకు మధ్య ప్రధాన పోటీ ఉంటుందని వ్యాఖ్య
- అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్న విజయ్
- మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తానని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:ఒక్కడినే వస్తా.. ఒక్కడినే పోరాడతా.. అడవిలో నక్కలు, తోడేళ్లు, జంతువులు ఎన్నో ఉంటాయి.. కానీ సింహం ఒంటరిగా ఉంటుంది.. ఒంటరిగా పోరాడుతుంది.. ఇది.. నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ అధ్యక్షుడు విజయ్ భారీ బహిరంగ సభలో ఉద్రూతలూగించిన డైలాగ్. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత పెట్టిన రెండో మహానాడులో విజయ్ స్పీచ్ కు సభ దద్దరిల్లిపోయింది. వచ్చే ఎన్నికల్లో ఏదో చేసేలా ఉన్నాడు.. అనుకునేలా గురువారం (ఆగస్టు 21) ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ సాగింది. తమిళగ వెట్రి కజగం పార్టీ రెండో మహానాడు తమిళనాడు మధురై జిల్లాలో లక్షలాది జనసందోహం నడుమ జరిగింది. ఈ సభకు దాదాపు 4 లక్షల మంది అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ చేసిన స్టేట్ మెంట్స్ తమిళ రాజకీయాల్లో హీట్ పుట్టిస్తున్నాయి. తమకు బీజేపీ, డీఎంకే రెండూ శత్రువులేనని స్పష్టం చేశారు విజయ్. బీజేపీ ఐడియాలజీ పరంగా శత్రువైతే.. డీఎంకే రాజకీయ శత్రువు అని అన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే వస్తానని.. పొత్తు కోసం ప్రయత్నించే వారికి క్లారిటీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో పోటీ డీఎంకేతోనేనని స్పష్టం చేశారు.

**పోటీ అక్కడి నుంచే:**

వచ్చే ఎన్నికల్లో తను ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారో ముందే ప్రకటించారు విజయ్.

వివరాలు 2లో..

## ఏపీలో రూ.2 కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత

- విజయవాడ-చెన్నై హైవేపై భారీగా ఎర్రచందనం పట్టివేత
- ప్రకాశం జిల్లా కె. బిట్రగుంట వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డ లారీ
- సుమారు రూ. 2 కోట్ల విలువైన 83 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- లారీతో పాటు ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్
- సిబ్బందిని అభినందించిన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా


పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికా రులు చేపట్టిన చర్యలు సత్ఫలితాల నిస్తున్నాయి. తాజాగా, విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై




వివరాలు 2లో..

## ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు...

- వాడీవేడి చర్చలు, నిరసనల మధ్య ముగిసిన పార్లమెంటు సమావేశాలు
- 120 గంటలు జరగాల్సిన సభ కేవలం 37 గంటలు మాత్రమే జరిగిన సమావేశాలు
- అనేక బిల్లులకు ఆమోదం



పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ వర్షాకాల సమా వేశాలు వాడీ వేడి వాగ్వాదాలు, అనూహ్య పరిణామాల మధ్య గురువారంతో ముగిశాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ ఆకస్మిక రాజీనామా, 'ఆపరేషన్ సిందూర్' పై ప్రధాని నరేంద్ర మోదీ-కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం వంటి కీలక పరిణామాలతో

వివరాలు 2లో..

## అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పై సీఎం చంద్రబాబు ఆగ్రహం



- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే సహించేది లేదని గట్టి హెచ్చరిక
- అధ్యాపకులను వేధిస్తున్నారంటూ దగ్గుపాటిపై సీఎంకు అందిన ఫిర్యాదులు
- ఏడుగురు ఎమ్మెల్యేల ప్రవర్తనపై అధిష్ఠానం ఆందోళన

వివరాలు 2లో..

## కుప్పకూలిన పాక్ ఆర్థిక వ్యవస్థ...

**పేదరికంలో 44.7 శాతం మంది**



- తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పాకిస్థాన్
- పేదరికంలో మగ్గుతున్న 44.7 శాతం జనాభా
- భారీగా పడిపోయిన తలసరి ఆదాయం, దేశ జీడీపీ
- రాజకీయ అస్థిరత, ద్రవ్యోల్బణమే ప్రధాన కారణాలు
- ఆందోళనకర స్థాయికి చేరిన నిరుద్యోగం, అసమానతలు
- విద్యా, వైద్య రంగాలపై ప్రభుత్వ వ్యయంలో భారీ కోత

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. దేశ జనాభాలో దాదాపు సగం మంది, అంటే 44.7 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన జీవి స్తున్నారని ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో ఎ ెల్లడించడం అక్కడి దయనీయ పరిస్థితులకు అద్దం పడుతోంది. రాజకీయ అస్థిరత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పడిపోతున్న పారిశ్రామిక

వివరాలు 2లో..



## చంద్రబాబు, నితీశ్ టార్గెట్‌గా కేంద్రం కుట్ర

**తేజస్వి యాదవ్ సంచలన ఆరోపణలు**

- తీవ్ర నేరారోపణలపై అరెస్టయితే పదవి నుంచి తొలగించే బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం
- ప్రధానులు, సీఎంలు, మంత్రులకు 30 రోజుల గడువు
- ఇది చంద్రబాబు, నితీశ్‌లను బెదిరించడానికేనన్న తేజస్వి యాదవ్
- మిత్రపక్షాలను బ్లాక్‌మెయిల్ చేసే కుట్రలో భాగమేనని ఆరోపణ
- సోరెన్, కేజ్రీవాల్‌లాగే ఇతరులనూ లక్ష్యం చేసుకుంటారని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### షర్మిల మరోదారి వెతుక్కోవాల్సిందేనా?

## కాంగ్రెస్ లో కంఫర్ట్ గా లేరా?

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల పునరాలోచనలో పడ్డారా? కాంగ్రెస్ లో కొనసాగితే ఇక రాజకీయ భవిష్యత్ ఉండదని ఆమె ఒక క్లారిటీకి వచ్చినట్లు తెలిసింది. అందుకే అప్పుడప్పుడు అలా వచ్చి ఇలా వెళుతున్నారంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎటు చూసినా కాంగ్రెస్ పార్టీకి రాజకీయ భవిష్యత్ లేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ కు దాదాపుగా నూకలు చెల్లినట్లే. అసలు ఓటు బ్యాంకు కూడా లేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీ అధినేత జగన్ కొల్లగొట్టుకుని వెళ్లిపోయారు. ఆ ఓటు బ్యాంకును తిరిగి సాధించడం మాత్రం జరిగే పని కాదు. ఒకవైపు అనాలోచితంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ను క్షమించకూడదని ప్రజల్లో బలంగా సెంటిమెంట్ నాటుకుపోయింది.

**ఓటు బ్యాంకు లేక...**

అదే సమయంలో జగన్ పార్టీకి దాదాపు పదేళ్ల నుంచి అలవాటుపడిపోయిన ఓటు బ్యాంకు తిరిగి కాంగ్రెస్ వైపునకు చూసే ఛాన్స్ లేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన చేసిన తర్వాత ఎన్ని మార్పులు చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వైఎస్ కుమార్తె అయిన షర్మిలను తెచ్చిపెడితే కనీసం కొన్ని సీట్లు అయినా రకపోతాయా? అని భావించి ఆమెకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చింది. అయితే గత ఎన్నికల్లో సేమ్ సీన్ రిపీట్ అయింది. షర్మిల కూడా పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఇక పార్టీ కేంద్ర నాయకత్వానికి కూడా ఆంధ్రప్రదేశ్ పై ఆశలు వదిలేసుకుంది. అందుకే పెద్దగా ఏపీ పాలిటిక్స్ ను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని అంటున్నారు.

**కాంగ్రెస నాయకులు కూడా...**

రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ దేశమంతా అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావిస్తున్నప్పటికీ ఏపీ పేరును ఎత్తకపోవడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. మరొకవైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై కూడా చాలా మంది నేతలలో ఉన్న అపోహలు తొలిగిపోయాయంటున్నారు. షర్మిల తన పదవిని అడ్డం పెట్టుకుని కేవలం తన సోదరుడు జగన్ పై విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, వ్యక్తిగత విభేదాలకే పెద్దపీట వేస్తున్నారని అంటున్నారు. అందుకే పార్టీలో సీనియర్ నేతలు హర్షకుమార్, చింతామోహన్ వంటి నేతలు కూటమి ప్రభుత్వంపై గళం విప్పాల్సి వస్తుందంటున్నారు. ఈ సమయంలో వైఎస్ షర్మిల వేరే దారి వెతుక్కోవాల్సిందేనా? అన్న అభిప్రాయం ఆమె అనుచరుల నుంచి వినిపిస్తుంది. కాంగ్రెస్ లో ఎన్నాళ్లున్నా ఇంతే పరిస్థితి అని వారు షర్మిలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. మరి వైఎస్ షర్మిల ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు...

- మొదటి పేజి తరువాయి

సభ దద్దరిల్లింది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)'కు వ్యతిరేకంగా విపక్షాల ఆందోళనలతో సమావేశాలు చివరి వరకు గందరగోళంగానే సాగాయి.

**ఈ సమావేశాల్లో చోటుచేసుకున్న ముఖ్యమైన పరిణామాలు ఇవి**

1. ఉపరాష్ట్రపతి రాజీనామా: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేశారు. ఇంకా రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే ఆరోగ్య కారణాలను చూపుతూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆకస్మిక పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.
2. మోదీ–రాహుల్ మధ్య మాటల యుద్ధం: 'ఆపరేషన్ సిందూర్' అంశంపై లోక్‌సభలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌ను గుడ్డిగా నమ్ముతోందని మోదీ విమర్శించగా, ప్రభుత్వం భారత పైలట్ల సామర్థ్యాన్ని తక్కువ చేసిందని, కేవలం మోదీ ప్రతిష్ఠను కాపాడేందుకే ఈ ఆపరేషన్ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.
3. ఎస్ఐఆర్ పై విపక్షాల ఆందోళన: బీహార్ ఎన్నికల ముందు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి పార్లమెంటు లోపల, బయట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. 'ఓట్ల దొంగతనాన్ని ఆపండి' (స్టాప్ వోట్ చోరీ) అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేసింది.
4. కీలక బిల్లులకు ఆమోదం: ఈ సమావేశాల్లో రాజ్యసభ 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు 2025'కి ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఆన్‌లైన్‌లో డబ్బుతో ఆడే ఆటలను, వాటి ప్రకటనలను నిషేధిస్తుంది. మరోవైపు, తీవ్రమైన నేరారోపణలపై 30 రోజులు నిర్బంధంలో ఉన్న ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రులు రాజీనామా చేయాలని నిర్దేశిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఓ కీలక బిల్లును ప్రవేశపెట్టారు.
5. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో దక్షిణాది పోరు: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటములు రెండూ దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థులనే బరిలోకి దింపాయి. ఎన్డీఏ తరఫున తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరఫున తెలంగాణకు చెందిన జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి పోటీలో నిలిచారు.
6. ఆరోపణలపై త్రిసభ్య కమిటీ: జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన 'క్యాష్–ఎట్–హోమ్' ఆరోపణలపై విచారణకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సుప్రీంకోర్టు జడ్జి అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ అడ్వొకేట్ పీవీ ఆచార్య సభ్యులుగా ఉన్నారు.
7. సభా పనితీరుపై స్పీకర్ అసహనం: విపక్షాలు ప్రణాళిక ప్రకారమే సభా కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టించాయని స్పీకర్ ఓం బిర్లా విమర్శించారు. మొత్తం 120 గంటలు జరగాల్సిన సభ కేవలం 37 గంటలు మాత్రమే పనిచేసిందని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశాల్లో లోక్‌సభ 12, రాజ్యసభ 14 బిల్లులను ఆమోదించాయి.

# రసిక బాబు కథలు

- మొదటి పేజి తరువాయి

వ్యభిచార గృహాలు తణుకు, రాజమండ్రి వరకు ఉన్నా... ఇప్పుడు విశాఖపట్నం వరకు విస్తరించనున్నాడని విశ్వసనీయ సమాచారం..? కొందరు మహిళలను తన వ్యాపార సామ్రాజ్యంలోకి దించి... మహిళలను భయపెట్టి నోట్ల కట్టలు వెరవేశి ఒప్పించేవాడని విశ్వసనీయ సమాచారం..?

మట్టి మాఫియా, నాన్ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలు –వీటిలో ఒక్కటీ అతని దృష్టికి తప్పలేదు.

రిజిస్ట్రరు ఆఫీసులు, మున్సిపల్ అధికారి డెస్కులు, రేషన్ మాఫియా %–% అందరికీ రసిక బాబు "వసూలు" బ్రాండ్ లాంటివాడు.

"రాజకీయ నేతలతో స్నేహం – పోలీసుల నుంచి రక్షణ"

రసిక బాబు అసలు బలమైన ఆయుధం రాజకీయనేత ఆ అన్నేనట. ఆ అన్నతో సంబంధాలు పెట్టుకుని రసిక బాబు పోలీసుల దాడులు నుంచి తప్పించుకున్నాడు.

"పి.ఎ" ఫోన్ల ద్వారా భయపెట్టి తేలికగా బయట పడతాడు. కేసులు గుట్టలు కుప్పలు లా వచ్చినా, పోలీసుల నిర్లక్ష్యం కలగలిపి "ఎగిరేస్తే ఎగిరే ఈగ"లా తప్పించుకుంటున్నాడు.

**"అప్పుల మోత – వ్యాపారాలపై వసూళ్ల దెబ్బ"**

తాడేపల్లిగూడెంలో ఒక్క చిల్లర వ్యాపారిని వదిలేది లేదు. అప్పుల పర్వతంలో కూరుకుపోయినా, వసూళ్ల వలలో విర్రవీగే రసిక బాబు.

**"ఇంట్లో ఈగల మోత– బయట పల్లకీ మోత" :**

అనే సెటైర్లు వెనుకడుగు వేయనివి కాదు. నిజానికి అతని బతుకంతా అప్పులకే బానిస, కానీ ఇతరులను బ్లాక్‌మెయిల్ చేసి మరీ లగ్జరీ లైఫ్ కొనసాగిస్తున్నాడు. వ్యభిచారం, గంజాయి, బ్లాక్‌మెయిల్, మట్టిమాఫియా%ొ% ఇవన్నీ ఎవరి అండర్ కవర్‌లో నడుస్తున్నాయి? పోలీసుల కళ్ళకు ఈ దందాలు కనబడకపోవడం గమనార్హం... ఇక్కడ స్పెషల్ బ్రాంచ్ ఏం చేస్తుందని పలువురు విమర్శలు గుప్పించడం విశేషం..? పోలీసుల నిఘా వ్యవస్థ అన్నది ఇక్కడ వేల డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

**ఎపిసోడ్ 3 లో - రసిక బాబు, గుప్త ఆర్థిక సామ్రాజ్యం, అతని రాజకీయ లింకులు, మాఫియా లావాదేవీల అసలు రహస్యాలు బట్టబయలు కానున్నాయి.**

## చంద్రబాబు, నితీశ్ టార్గెట్‌గా కేంద్రం కుట్ర

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఒక కొత్త బిల్లు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఇది ఎన్డీయే కూటమిలోని కీలక మిత్రపక్షాలైన టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను బెదిరించి, తమ అదుపులో ఉంచుకోవడానికేనని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. తీవ్రమైన నేరారోపణల కింద అరెస్టయిన ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు లేదా మంత్రులు 30 రోజుల్లోగా తమ పదవులకు రాజీనామా చేయాలని, లేదంటే వారిని తొలగించేలా ఈ బిల్లును రూపొందించారు. బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తేజస్వి యాదవ్ ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం టీడీపీ, జేడీయూ మద్దతుతోనే కొనసాగుతోందని, భవిష్యత్తులో వారిని రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేసేందుకే ఈ బిల్లును ఒక ఆయుధంగా వాడుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దేశాభివృద్ధిని పక్కనపెట్టి, విధ్వంసకర వ్యూహాలు రచిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఝూర?ండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌లను జైలుకు పంపారని గుర్తుచేశారు. ఇప్పుడు ఈ కొత్త చట్టం ద్వారా చంద్రబాబు, నితీశ్ వంటి నేతలను కూడా బెదిరించాలని చూస్తున్నారని అన్నారు. అవసరమైతే వారిపై కొత్త కేసులు బనాయించి, తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి కేంద్రం ఎంతకైనా తెగిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ బిల్లు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేందుకు, తమకు నచ్చని నేతలను లక్ష్యంగా చేసుకునేందుకేనని ప్రతిపక్షాలు దుయ్యబడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కాంగ్రెస్ పార్టీ వంటి ఇతర విపక్షాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

## బనకచర్ల మరో కాళేశ్వరం అవుతుంది

- మొదటి పేజి తరువాయి

కానీ ముందు రాజోలి గురించి ఎందుకు ఆలోచించలేదన్నారు డీఎల్.రిజర్వాయర్లలో నీళ్లు పెడితే సరిపోదు ఆయకట్టు అభివృద్ధి చెందాలని... రిజర్వాయర్లు నిండితే మీ ప్రాంతంలో చెరువులకు నీటిని నింపుతామని జీవో ఇవ్వాలన్నారు డీఎల్.

**ప్యారసెటమాల్ కరువు:**

రియల్ టైం గవర్నెన్స్ అంటే ఇంటి దగ్గర బల్బు పోతే అది పోయిందని చెప్పడం అని ఒక ఐఏఎస్ అధికారి అంటున్నారన్నారని ఎద్దేవా చేశారు. గిరిజన ప్రాంతాల్లో పారాసిటమల్ మాత్ర లేక చనిపోయిన పరిస్థితి వుందని... పారాసిటమాల్ మాత్ర ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ విషయం పై ప్రభుత్వానికి లేఖ రాశానని... మెయిల్ చేసినా కూడా స్పందన లేదని అన్నారు డీఎల్.ఆరోగ్యశాఖ మంత్రి గిరిజన ప్రాంతాల్లో తొంగి చూసిన పరిస్థితి కూడా లేదని అన్నారు డీఎల్.

**ఒక్క కొత్త పించన్ అయినా ఇచ్చారా:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని అన్నారు డీఎల్.44 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యపై ధర్నా చేద్దామనుకున్నానని... సీఎం చంద్రబాబు నాయుడు ఒక ఊరిలో పెన్షన్ ఇవ్వడానికి వచ్చి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు డీఎల్. అసలైన వికలాంగుల పెన్షన్లు తీసేసి అనర్హుల పెన్షన్లు కొనసాగిస్తున్నారని... పెన్షన్లు కొనసాగించేందుకు బ్రోకర్లు కూడా ఉన్నారని మండిపడ్డారు డీఎల్.ఓట్లు వేసిన పాపానికి ప్రజలు రోజు ఎందుకు ఏడవాలని ఆయన ప్రశ్నించారు.

## అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పై సీఎం చంద్రబాబు ఆగ్రహం

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యవహార శైలిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస వివాదాలపై వివరణ కోరిన సీఎం, ఆయన తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు.

అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వేధింపులకు గురిచేస్తున్నారంటూ కొందరు అధ్యాపకులు ఇటీవల ముఖ్యమంత్రికి నేరుగా ఫిర్యాదు చేశారు. దానికి తోడు ఇటీవలి వివాదం (ఎన్టీఆర్ పై వ్యాఖ్యలు)పైనా తీవ్రంగా స్పందించిన చంద్రబాబు, తక్షణమే వివరణ ఇవ్వాలంటూ ఎమ్మెల్యేను ఆదేశించినట్టు

తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఒకసారి సీఎంను కలిసిన దగ్గుపాటి, గురువారం మరోసారి ముఖ్యమంత్రిని కలిసి తన వాదన వినిపించారు. అయితే, ఆయన వివరణతో సంతృప్తి చెందని సీఎం, ప్రజల సమస్యలు పరిష్కరించాలే తప్ప, వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. తన దృష్టికి ఇప్పటికే చాలా ఫిర్యాదులు వచ్చాయని, ఇదే తీరు కొనసాగితే ఉపేక్షించే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు.

## నెలకొకసారి ఢిల్లీ వెళ్లి చంద్రబాబు ఏం సాధించారు..?

- మొదటి పేజి తరువాయి

ఇవ్వలేదని అన్నారు బొత్స. వితంతు పెన్షన్లు లక్ష మందికి ఒకేసారి ఇస్తున్నామని చెప్పి హడావిడి చేసారని.. ఏడాదిన్నర కాలంలో ఎంతమందికి వితంతు పెన్షన్ ఇచ్చారో చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సర్వనాశనం అయిపోయిందని.., ఎవరికి ఎకౌంటబిలిటీ లేదని అన్నారు బొత్స. రాష్ట్రంలో శాంతిభద్రత విషయం కానీ , సంక్షేమ కార్యక్రమాల అంశం కానీ, గత వైసిపి ఐదేళ్ల కాలంలో ఎలా ఉంది అనేది ... ఈ 14 నెల కాలంలో క్రైమ్ రేట్ ని చూస్తే తెలుస్తుందని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు 32 మంది బలిదానంతో సాధించుకున్నామని.. అలాంటి ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు బొత్స.విశాఖ హుక్కు పై జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో వైసిపి నేతలంతా పోరాటాన్ని ఉధృతం చేస్తామని.. తమతో కలిసి వచ్చిన అందరినీ కలుపుకుంటామని స్పష్టం చేశారు బొత్స.

## ఏపీలో రూ.2 కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత

- మొదటి పేజి తరువాయి

భారీ ఎత్తున ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ముఠా గుట్టును రెడ్ శాండర్స్ యాంటీ–స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ బృందం రట్టు చేసింది. ఈ ఆపరేషన్‌లో కోట్ల విలువ చేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేశారు.

వివరాల్లోకి వెళితే, టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రకాశం జిల్లా కె. బిట్రగుంట గ్రామం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న ఒక లారీని ఆపి సోదా చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. లారీలో మొత్తం 83 దుంగలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపు రూ. 2 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసులు, లారీతో పాటు అందులో ఉన్న ఎర్రచందనం దుంగలను సీజ్ చేశారు.

ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రత్యేకంగా అభినందించారు. స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ఆయన ప్రశంసించారు.

## కుప్పకూలిన పాక్ ఆర్థిక వ్యవస్థ...

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి వంటి సమస్యలు దేశాన్ని ప్రమాదకర స్థితికి చేర్చాయి. ప్రపంచ బ్యాంకు 2025 నివేదిక ప్రకారం, రోజుకు 4.20 డాలర్ల (సుమారు రూ. 350) కంటే తక్కువ సంపాదిస్తున్న వారిని పేదలుగా పరిగణించగా, పాకిస్థాన్‌లో దాదాపు 44.7 శాతం మంది ఈ కేటగిరీలో ఉన్నారు. అంతకంటే దారుణమైన విషయం ఏమిటంటే, దేశ జనాభాలో 16.5 శాతం మంది, అంటే సుమారు 3.98 కోట్ల ప్రజలు తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారు. వీరి రోజువారీ ఆదాయం 3 డాలర్ల (సుమారు రూ. 250) కంటే తక్కువగా ఉంది. గతంలో ఈ సంఖ్య కేవలం 4.9 శాతంగా ఉండగా, ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది.పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ గణాంకాల ప్రకారం, దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. 2022లో 1,766 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2023 నాటికి 1,568 డాలర్లకు పడిపోయింది. అంటే, ఏడాది కాలంలో 11.38 శాతం క్షీణత నమోదైంది. ఇదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం కూడా 375 బిలియన్ డాలర్ల నుంచి 341.6 బిలియన్ డాలర్లకు తగ్గిపోయింది.

దేశంలో ద్రవ్యోల్బణం కూడా ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. ఈ ఏడాది జులైలో వార్షిక ద్రవ్యోల్బణం 4.1 శాతానికి చేరింది. ఇది 2024 డిసెంబర్ తర్వాత అత్యధిక స్థాయి కావడం గమనార్హం. ముఖ్యంగా ఆహార పదార్థాలు, ఇంధన ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుల కొనుగోలు శక్తి దెబ్బతింది. కుటుంబాలు భోజనం, విద్య, వైద్యం వంటి నిత్యావసర ఖర్చులను తగ్గించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రభుత్వం కూడా తాజా బడ్జెట్‌లో విద్యపై 44 శాతం, వైద్యంపై నామమాత్రంగా జీడీపీలో ఒక శాతం మాత్రమే కేటాయించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.ప్రాంతీయ అసమానతలు కూడా ఈ సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి. కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్ వంటి నగరాలు అభివృద్ధి చెందుతుండగా, బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా వంటి ప్రాంతాలు వెనుకబడిపోయాయి. ఈ అసమానత ప్రజలలో అసంతృప్తిని, సామాజిక అశాంతిని పెంచుతోందని 'పాకిస్థాన్ అబ్జర్వర్' పత్రికలోని ఒక కథనం విశ్లేషించింది.

## ఒక్కడినే వస్తా.. ఒంటరిగా పోరాడతా

- మొదటి పేజి తరువాయి

మధురై ఈస్ట్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగనున్నట్లు అనౌన్స్ చేశారు. మధురై జిల్లాలో ఉన్న పది స్థానాల్లో ఎక్కణ్నుంచైనా పోటీ చేస్తానని.. టీవీకే క్యాడర్ మిగతా 234 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని.. టీవీకే కు ఓటు వేస్తే అది తనకు ఓటేసినట్లేనని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు.

**సీఎం స్టాలిన్ పై ఘాటు విమర్శలు:**

డీఎంకే అధ్యక్షులు, సీఎం స్టాలిన్ పై విజయ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తమిళనాడు ప్రజలను స్టాలిన్ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి మహిళలను, ప్రభుత్వ ఉద్యోగులను, ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. 2026 ఎన్నికల్లో డీఎంకేను గద్దె దించాలని కేడర్ కు పిలుపునిచ్చారు.

**బీజేపీపై బ్లాస్ట్ అయిన విజయ్:**

ప్రధాని మోదీ, బీజేపీలపై విజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమిళనాడు ప్రజల అవసరాలను, కష్టాలను అర్థం చేసుకోవడంలో బీజేపీ విఫలమైందని అన్నారు. %చీజుజుు% వివాదం, మత్స్యకారుల సమస్యలు, ఇతర సమస్యలను తీర్చలేకపోయిందని అన్నారు. మరోవైపు ఏఐఏడీఎంకే పార్టీ ప్రస్తుత నాయకత్వం కారణంగా కేడర్ అసంతృప్తితో ఉందని మండిపడ్డారు. బీజేపీ కనుసన్నల్లో పార్టీని నడుపుతండటంతో కేడర్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఎంజీ రామచంద్రన్ ఏర్పాటు చేసిన పార్టీ పరిస్థితి ఇలా కావడానికి కారణం ఆ పార్టీ నేతల అసమర్థతేనని విమర్శించారు.

**టీవీకే పార్టీ ప్రాధాన్యతలు ఇవే:**

టీవీకే ప్రాధాన్యతలేంటో చెప్పారు ఆ పార్టీ అధ్యక్షులు విజయ్. మహిళలు, బాలికలు, వృద్ధుల క్షేమమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. యువకులు, రైతులు, కూలీలు, మత్స్యకారులు, వయోవృద్ధులు.. ఇలా అందరి సంక్షేమం కోసం తాము అధికారంలోకి వస్తామని చెప్పారు.

## పోక్సో చట్టానికి స్త్రీ పురుషులనే వివక్ష లేదు



**కర్ణాటక పెన్ పవర్ ఆగస్టు 21 :** లైంగిక వేధింపులకు పాల్పడితే ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే. పోక్సో చట్టంపై స్పష్టతనిచ్చిన కర్ణాటక హైకోర్టు. కర్ణాటకలో 13 ఏళ్ల బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ 48 ఏళ్ల ఉపాధ్యాయురాలిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు. తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని కర్ణాటక హైకోర్టును ఆశ్రయించిన మహిళ. ఈ కేసు విచారిస్తూ పోక్సో చట్టానికి లింగ వివక్ష ఉండదని, నేరం చేసింది పురుషులైనా, మహిళలైనా సమాన శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేసిన కర్ణాటక హైకోర్టు జస్టిస్ ఎం.నాగప్రసన్న దేశంలో లైంగిక వేధింపులకు గురవుతున్న వారిలో 54.4% బాలురు, 46.6% బాలికలు ఉంటున్నారని పేర్కొన్న హైకోర్టు న్యాయమూర్తి. ఐపీసీలోని అత్యాచార చట్టం తరహాలోని కేవలం పురుషులని మాత్రమే నిందితులుగా నిర్ధారించాలని కోరిన నిందితురాలి తరపు న్యాయవాది. ఈ వాదనను తిరస్కరిస్తూ పోక్సో కేసులో లైంగిక వేధింపులు అనేది ఐపీసీలో అత్యాచారం లాంటిది కాదని స్పష్టం చేసిన న్యాయమూర్తి. తగిన ఆధారాలు సేకరించి నిందితురాలికి వెంటనే శిక్ష విధించాలని ట్రయల్ కోర్టును ఆదేశించిన కర్ణాటక హైకోర్టు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా





# ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి

## – రైతులు నానో యూరియాను వాడండి – జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 21 :** ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా?? కలెక్టర్ పి.రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కృష్ణగిరి మండల కేంద్రంలోని ఆముదం పంటను పరిశీలించి, ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆముదం పంటను పరిశీలిస్తూ ఆముదం పంట పండిస్తున్న రైతు మధుతో మాట్లాడుతూ ఆముదం పంటకు ఎకరానికి ఎంత పెట్టుబడి పెడుతున్నారు ??ఎకరానికి ఎంత లాభం వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు.. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ చేశారని కలెక్టర్ వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.. మండలంలో పంట నష్టం ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు.. యూరియా కి సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు భూసార సంరక్షణకు వీలుగా నానో యూరియాను వాడాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించండి. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించి, రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న బ్రహ్మానందరెడ్డి అనే రైతు పొలాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు.

ఆయిల్ పామ్ మొక్కలు నాటడానికి సంవత్సరానికి రైతులకు ప్రభుత్వం హెక్టార్‌కు 5 వేల 250 రూపాయల సబ్సిడీ ఇవ్వడంతో పాటు అదే విధంగా అంతర పంటలు వేసుకునేందుకు 5 వేల 250 రూపాయలు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. అందుకు సంబంధించిన డబ్బులు జమ అయ్యాయా అని కలెక్టర్ రైతును అడిగి తెలుసుకున్నారు. నిధులు జమ అయ్యాయని రైతు తెలిపారు. కృష్ణగిరి మండలంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాలలో ప్లాంటేషన్ చేయించడం జరిగిందని కలెక్టర్ హార్టికల్చర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.. 30 హెక్టార్లలో సాగు చేశామని హార్టికల్చర్ అధికారి తెలిపారు..రైతులు పత్తి,కంది, మినుము, పెసర తదితర పంటలతో అంతర పంటల సాగు చేసుకోవాలని సూచించారు.

**హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ను పరిశీలించిన కలెక్టర్ :** హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలిస్తూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 68 చెరువులకు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నీరు అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న ఒక రైతు పొలం నుండి పైప్ లైన్ వేసినట్లయితే 200 ఎకరాల పొలం సాగులోకి వస్తుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కొంతమంది రైతుకు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఒకసారి ఈ అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ ప్రసాద్, ఎంపిడిఓ మోహన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన, దివ్యాంగులు ఎవరూ


# ఆందోళన చెందాల్సిన పని లేదు

## - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, పెన్ పవర్ ఆగస్ట్ 21 :** పెద్దఎత్తున దివ్యాంగుల పింఛన్లు తొలిగిస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయంలో అధికారులతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకంపై సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకుని పెన్షన్ పొందుతున్నవారిపై ఇటీవల జరిపిన పున:పరిశీలన వివరాలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. ఈ ప్రక్రియలో అనర్హులను గుర్తించినట్టు, అన్నివిధాలా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండి... ఎలాంటి వైకల్యం లేకుండానే కొంతమంది పెన్షన్ పొందుతున్నట్టు పరిశీలనలో తేలిందని తెలిపారు. అనర్హులైన పెన్షన్లు ధృవీకరించడానికి ప్రత్యేక వైద్య బృందాలను నియమించి నిర్ధారించినట్టు వెల్లడించారు. అయితే నకిలీ పెన్షన్లను మాత్రమే తొలిగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ పింఛను దారుకు పెన్షన్ రద్దు కాకూడదని సమీక్షలో ముఖ్యమంత్రి స్పష్టంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన పెన్షన్లు యధావిధిగా కొనసాగుతాయని, దివ్యాంగులు ఎవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తాత్కాలిక సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగుల పెన్షన్, హెల్త్ పెన్షన్ పొందేవారికి కూడా ఎప్పటిలా నెలనెలా పింఛన్ అందించాలని స్పష్టం చేశారు. వారికి పంపించిన నోటీసులు సైతం వెనక్కి తీసుకోవాలని సీఎం చెప్పారు.

## వాకాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్




**వాకాడు, పెన్ పవర్ ఆగస్టు 21 :** ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ వాకాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్. జిల్లా కలెక్టర్ వాకాడు లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని కొత్త ఎక్స్రే యూనిట్ ను ప్రారంభోత్సవం చేసిన అనంతరం మాట్లాడుతూ.. ఆస్పత్రికి చికిత్స కోసం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని తెలిపారు. వివిధ విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి, అక్కడి సౌకర్యాలు, వైద్య సేవలను గురించి తెలుసుకున్నారు. స్వయంగా రోగులతో ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్డెంట్ డా. రోహిత్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "ఉల్లాస్... అక్షరాంధ్ర"లో అందరూ భాగస్వాములవ్వాలి

## - జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి




**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 21 :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగాప్రారంభించిన "ఉల్లాస్... అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించడంలో జిల్లా మరియు మండల స్థాయి అధికారులందరూ భాగస్వాములవ్వాలన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలోని పిజిఆర్ఎస్ హాలులో "ఉల్లాస్... అక్షరాంధ్ర" కార్యక్రమం పై జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గతంలో జి ఎస్ డబ్ల్యు ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాస్ట్ సర్వే ద్వారా నంద్యాల జిల్లాలో మొత్తం 3,02,050 మంది వయోజన నిరక్షరాసులు గుర్తించబడ్డారని తెలిపారు. వారిలో మొదటి విడతలో 1,00,686 మందిని ఈ సంవత్సరంలో అక్షరాసులుగా మార్చేందుకు సంబంధిత శాఖల సహకారంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే మూడేళ్లలో మొత్తం నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చి, నంద్యాల జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత ఏడాది ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లాలోని 28 మండలాల్లో డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా 26,785 మందికి అక్షరాస్యత కల్పించామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న రెండో విడత కార్యక్రమంలో డి ఆర్ డి ఎ, డ్వామా, మెప్మా శాఖల ద్వారా 100686 మంది శిక్షణ మరియు బోధన ఇచ్చేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఒక్కో వాలంటీర్ టీచర్‌కు 10 మంది లెర్నర్ల కేటాయింపు ఆగస్టు నుండి 2026 ఫిబ్రవరి 20 వరకు 100 గంటల తరగతులు రెండు ప్రాథమిక పుస్తకాలు, ఐదు మోడల్ పేపర్లు ఫైనాన్షియల్, డిజిటల్, ఫంక్షనల్, లీగల్ లిటరసీపై శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ పొందిన వారికి 2026 మార్చిలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ న్యూ ఢిల్లీ వారిచే ధ్రువ పత్రములు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పనిచేసిన స్వచ్ఛంద ఉపాధ్యాయులకు కూడా ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి వయోజన విద్యాశాఖ సహాయ సంచాలకులు మరియు పర్యవేక్షకులు రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించి ఉల్లాస్ కార్యక్రమము యొక్క ఉద్దేశాలు లక్ష్యాలు అనుసరించవలసి పద్ధతులు వయోజన నిరక్షరాస్యులను వయోజన విద్యా కేంద్రాల వైపు ఆకర్షించే పద్ధతులు గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, డి ఆర్ డి ఏ పథక సంచాలకులు శ్రీధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, డ్వామా పథక సంచాలకులు సూర్యనారాయణ, డి ఎల్ డి ఓ శివారెడ్డి, వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి బీవీ భాస్కర్ రెడ్డి, వయోజన విద్యాశాఖ సిబ్బంది, 28 మండలాల ఎంపీడీవోలు ఎంఈఓలు, డిఆర్డిఏ ఏపీఎంలు, డ్వామా ఏపీవోలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

## మట్టి గణేష్ విగ్రహాలను వాడుదాం... పర్యావరణ పరిరక్షణకు చేయూతనిద్దాం

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 21 :** సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాలను వాడి వాటిని ప్రోత్సహించాలని, పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యత గా చేయూతను అందిద్దామని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయక చవితి విశిష్ఠతను కాపాడేందుకు మన మందరం సమిష్టిగా కృషిచేయడం వల్ల ఒక గొప్ప మార్పును సాధించవచ్చునన్నారు. సహజ రంగులతో మట్టి విగ్రహాలను తయారు చేయడం స్వచ్ఛతకు ఒక చిహ్నమే గాక.. ఖర్చుకూడా తగ్గి ఆర్థికంగా కూడా కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. మనమందరము వినాయకుని పండుగను పర్యావరణానికి అనుకూలంగా. జరుపుకుందామన్నారు. మన చెరువులు, జలవనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గిందామనీ అన్నారు. చెరువులు, సరస్సులు జలాశయాలు, జీవరాశుల మనుగడ ముఖ్యమని వాటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు విషపదార్థాల వినియోగం వలన జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. వీటి వలన జలవనరుల నాణ్యత తగ్గడంతో పాటు వృక్ష, జంతు జీవనం పై ప్రభావము కలుగుతుందన్నారు. నీటిలో విష రసాయన వ్యర్థాలు కలవడం వలన ఊపిరితిత్తులతో పాటు, చర్మ, రక్త, కంటి సంబంధ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు వస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ మట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# తల్లిదండ్రుల ఆశయాలను మీరు నెరవేర్చాలి

## యువత మంచి ప్రవర్తనతో మెలగాలి : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**పి.కొత్తకోట, పెన్ పవర్ ఆగస్టు 21 :** టీనేజ్ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండండి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు గురువారం పి కొత్తకోట లోని వేము ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నందు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఫస్ట్ ఇయర్ బీటెక్ నూతన విద్యార్థులు ప్రవేశం సందర్భంగా కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్‌కే చంద్రశేఖర్ నాయుడు, హెచ్ఓడియు శశికళ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా చేరి విద్యార్థులకు డిగ్రీ కళాశాల మీ భవిష్యత్తు పునాదుకు ఇది తొలి మెట్టు అని విద్యార్థులకు హితవు పలికారు. విద్యార్థులు తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండండి, సెల్ ఫోన్లు విడనాడండి,క్రీడలపై ఆసక్తి కలిగిఉండాలి,కళాశాలలో లైబ్రరీలో మంచి విజ్ఞానం సంపాదించుకోవాలి రోజుకు 15 నిమిషాలు ఆంగ్ల దినపత్రికను చదవాలి. నైపుణ్యంతో మంచి ఫలితాలు సాధించాలి అప్పుడే మీకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు రీల్ లైఫ్ గురించి ఆలోచించాలి. డిగ్రీ కళాశాలలో పోటీ తత్వంతో చదివి ఉన్నత శిఖరాల అధిరోహించాలి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగాల భర్తీకి వివిధ పోటీ పరీక్షలు నిర్వహిస్తారు వాటిలో మీరు పోటీ బడి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. గ్రామీణ వాతావరణంలో ఉండి డిగ్రీ కళాశాలలకు మీరు ఈరోజు చేరడం జరిగిందని. జిల్లాలో సుమారు డిగ్రీ విద్యార్థులు 20,000 మంది ఉంటారని వారిలో కొందరు బంగారు భవిష్యత్తులోఅందుకుంటున్నారని తెలిపారు. మీ గురించి తల్లిదండ్రులుఎలాకష్టపడుతున్నారు మీరు తెలుసుకోవాలని తెలిపారు. చెడు సావాసాలు దూరంగా ఉండండి. కళాశాలలో మంచి వాతావరణంలో మంచి ప్రవర్తనతో మెలిగినప్పుడే సమాజంలో మీకు ఉన్నత స్థానం లభిస్తుందని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇంగ్లీష్ భాష పైన మంచి పట్టు సాధిస్తేవివిధ కంపెనీలు క్యాంపస్ సెలక్షన్ లో మీరు ధైర్యంగా ఎదుర్కొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ డి.చంద్రశేఖర్, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 21 :** హౌసింగ్ పథకం కింద జిల్లాలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంఐ ట్యాంకులు మరియు గ్రౌండ్ వాటర్, స్వామిత్వ కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు మరియు అమలు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోజురోజుకు పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సంబంధిత హౌసింగ్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని లేఅవుట్ వారీగా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకోని పనిచేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆశించిన పురోగతి చూపాలన్నారు. జిల్లాలో సర్వే టీం సమన్వయంతో పనిచేసి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రౌండు ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలైడేషన్‌కు సంబంధించిన సర్వేను జాగ్రత్తగా చేయాలన్నారు. ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో సర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని అధికారులు, సిబ్బంది సమన్వయంతో భూ రికార్డుల స్వచ్ఛీకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రీసర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో నీటిని వృధా చేయకుండా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులన్నీ పూర్తి చేసేందుకు నీతిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూమి పైన పడిన ప్రతి వర్షపు చుక్క వృధా కాకుండా భూమిలో ఇంకేటట్లు నీటి సంరక్షణ పనులు చేపట్టి గ్రౌండ్ వాటర్ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఆర్టిజిఎస్ లెన్స్ ఏ ఏ పారామీటర్ ఎంత వచ్చింది తదితర వివరాలు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా పట్టణంలోని డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా చూడాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు.

## అన్నమయ్య జిల్లాలో విషాదం...
## ఈతకు వెళ్లి ఊబిలో చిక్కుకున్న యువకులు...







**అన్నమయ్య పెన్ పవర్ ఆగస్టు 21 :** అన్నమయ్య జిల్లాలో రాజంపేట బాలరాజు పల్లి నదిలో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు ఊబిలో చిక్కుకొని విగత జీవులుగా మృతి చెందారు.. దిలీప్ 23 సంవత్సరాలు, రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. చంద్రశేఖర్ రెడ్డి 22 సంవత్సరాలు, కేశవ్ 22 సంవత్సరాలు.

## గదిలో మరిచిపోయిన వస్తువులు తిరిగి భక్తుడికి అప్పగింత



**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 21 :** తిరుమలలోని కృష్ణ సదన్ విశ్రాంతి గృహంలో ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీ కల్లూరి వెంకట సుబ్బారావు అనే భక్తుడు గురువారం గదిలో మరిచిపోయిన పర్సు, రూ.1.10 లక్షలు విలువైన 12 గ్రాముల బంగారు బ్రాస్ లెట్, చేతి గడియారాన్ని టీటీడీ సిబ్బంది తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణ సదన్ లో అటెండర్‌గా పని చేస్తున్న శ్రీ మహిధర్ రెడ్డికి సదరు భక్తుడు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీ విజయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత ప్రాణాలపైకి తీసుకొచ్చుకోవద్దు
### గంగవరం ఎస్ఐ వెంకటేష్



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21 :** మద్యం సేవించి యువత ద్విచక్ర వాహనాలను అధిక స్పీడుతో నడుపుతున్నారని దీంతో మృత్యువాత పడుతున్నారని ప్రాణాల పైకి తెచ్చుకోవద్దని గంగవరం ఎస్సై వెంకటేష్ సూచించారు. గురువారం రాత్రి గంగవరంలో యువకులతో సమావేశం నిర్వహించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సారాయి వంటి నిషేధిత పదార్థాలను వాడొద్దని అలాగే వాటి రవాణా కు సహకరించవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినట్లయితే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలన్నారు. యువత ఎటువంటి రిస్కు తీసుకోవద్దని సూచించారు. గంగవరం పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఆగష్టు 22న శ్రీ కపిలేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 21 :** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఆగష్టు 22వ తేదీన శ్రీ కామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గణపతి పూజ, లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్ల తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

## నగరి అభివృద్ధి పై ముఖ్యమంత్రి అన్ని విధాలా సహకారం...
### - ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 21 :** ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్ర బాబు నాయుడుతో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గురువారం అమ రావతి సెక్రటేరియట్ లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నగరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అవసరమైన నిధులు మంజూరుకు విజ్ఞప్తి చేశారు. ముఖ్య మంత్రికు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే నగరి గడ్డపై ఇచ్చిన హామీ మేరకు మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుచేయడంపై ముఖ్యమంత్రి గారికి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదములు తెలిపారు. నగరి రూరల్ మరియు అర్బన్, విజయపురం, నింద్ర మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని విజ్ఞప్తి చేశారు. కోసలనగరం పారిశ్రామిక కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. గాలేరు – నగరి ప్రాజెక్ట్ కు సంబందించి పుత్తూరు లో ఉన్న వేణుగోపాల సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కు సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిది మంజూరు కు సంబందించి వచ్చిన విజ్ఞప్తులను ముఖ్యమంత్రికి అందజేశారు. నగరి నియోజకవర్గం లో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పార్టీ సంస్థాగత ఎన్నికల కమిటీ లు, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం అమలు తీరుపై సమీక్షించారు. నగరి నియోజకవర్గం అభివృద్ధికి అన్నీ విధాలుగా సహకరిస్తానని ముఖ్యమంత్రి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కు భరోసా ఇచ్చారు.

## ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో బిసి బాలికల అదనపు వసతి గృహానికి శంఖుస్థాపన






**చిత్తూరు, పెన్పవర్ ఆగస్టు 21 :** ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్‌పిఎస్ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో పూతలపట్టు ఎంఎల్ఏ కె.మురళి మోహన్ తో కలసి ప్రభుత్వ బిసి బాలికల హాస్టల్ భవన నిర్మాణ శంఖుస్థాపన, భూమి పూజ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఛుడా ఛైర్మన్ కఠారి హేమలత, దాతలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో అదనపు సౌకర్యాలు కల్పించడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా బాలికల బిసి హాస్టల్ నిర్మాణం జరుగుతున్నదన్నారు.

ప్రభుత్వ రంగంలో నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పన మరింత జరగాల్సిన అవసరముందని, ప్రభుత్వ, ప్రైవేట్ భాగ స్వామ్యంతో సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఎన్ పి ఎస్ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల పై గల విశ్వాసంతో ఈ ఆర్థిక సంవత్సరంలో 200 కు పైగా విద్యార్థులు కళాశాలలో చేరారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా వసతులు ఏర్పాట్లు పూర్తి చేయాలసిన అవసరం ఉందని, కళాశాల ప్రిన్సిపల్ తో సమన్వయం చేసుకుని కళాశాలను మరింత మెరుగ్గా అభివృద్ధి చేస్తామన్నారు. విద్యాలయాలలో వసతుల లేమి, కుటుంబ, ఆర్థిక ఇబ్బందులు విద్యార్థి అభ్యున్నతికి అడ్డంకులు కావని, విద్యార్థులు ఖాళీ సమయంలో విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని, అట్టడుగు స్థాయి వర్గాలకు చెందిన కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులు ఉన్నత స్థాయిని సాధిస్తున్నారన్నది గుర్తుంచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే కఠోరమైన శ్రమ అవసరమని, సామాజిక మాద్యమాల వినియోగానికి బానిసలు కాకుండా, అవసరమైన మేరకు వినియోగించుకోవాలని, లేకపోతే విద్యార్థి విలువైన సమయం వృధా అవుతుందన్నారు. ఖాళీ సమయాల్లో ఎక్కువగా లైబ్రరీలో గడుపుతూ పుస్తకాలను చదవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదల పై ఎన్నో కలలు కంటుంటారని, వారి ఆశలు ఫలించాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలన్నారు. పూతలపట్టు ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలోని దాతలు ముందుకు వచ్చి చిత్తూరులో ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం భవన నిర్మాణం చేపట్టడం జరుగుతున్నదని, ఇది శు భపరిణామామన్నారు.

ప్రపంచానికి వెలుగునిచ్చేది చదువు, జ్ఞానమని నమ్మిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్న బిసి బాలికల వసతి గృహ నిర్మాణానికి అనుమతుల మంజూరులో చొరవ చూపడంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తున్న వెంకటేశ్వర చౌదరి, తేజోమూర్తి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. హాస్టల్ సౌకర్యాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టల్ లో విద్యార్థులకు చదువుకోవడానికి ఎక్కువ సమయం లభిస్తుందని, చదువు పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. సావిత్రమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యనభ్యసించిన చాలా మంది ఉన్నత స్థాయికి వెళ్లారని, ప్రస్తుతం ఉన్న విద్యార్థులు కూడా శ్రమించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు తమ తమ జీవితాన్ని బంగారుమయంగా మార్చుకునే ప్రయోగశాలగా భావించాలన్నారు. చూడ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ బిసి హాస్టల్ ఏర్పాటుకు స్థలం అందించి నిర్మాణానికి కృషి చేస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మనిషి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది చదువు ఒక్కటేనని, బాగా చదువుకుని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

## నిర్దేశిత లక్ష్యం మేరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





కడప, పెన్ పవర్ ఆగస్టు 21 : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యం మేరకు పెండింగ్ లేకుండా.. పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబం ధిత శాఖల అధికారులతో.. స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి ఎంఐ ట్యాంకులు&గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, స్వమిత్వ కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు&అమలు, దిగువ కోర్టులలో ఖాళీగా ఉన్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ, రీ సర్వే, ఇసుక సరఫరా తదితర అంశాలపై.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ అదితి సింగ్ హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు.. జిల్లాలో ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై వీక్లీ మీటింగ్స్ నిర్వహించాల న్నారు. ప్రస్తుతం.. వర్షాలు విరివిగా కురుస్తున్నందున జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్రా అవార్డుల ప్రదానంకు సంబంధించి.. ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వ కారణంగా ఇసుక సేకరణ సాధ్యం కాదు కాబట్టి ఇప్పటినుంచి అవసరమైన మేర ఇసుక నిల్వలను పెంచుకోవాలని ప్రభుత్వం సూచించిందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో.. అందుబాటులో ఉన్న జలవనరులను సంరక్షించుకునే చర్యలను చేపట్టాలన్నారు. భూగర్భ జల వనరులను పెంపొందించడంతో పాటు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపే చర్యలను చేపట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పర్ఫార్మెన్స్ రిపోర్టును ప్రతి రోజు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, ప్రభుత్వ సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, సీపీవో హాజరతయ్య, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ఆర్థిక భద్రతకు పెట్టుబడులు చాలా కీలకం
### జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్




**తిరుపతి , పెన్ పవర్ ఆగస్టు 21 :** వ్యక్తిగత ఆర్థిక భద్రతకు పెట్టుబడులు చాలా కీలకమనిజిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ కార్యాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సెబీ వారిచే ఏర్పాటు చేసిన ప్రాంతీయ పెట్టుబడి దారులకు సెమినార్ మరియు అవగాహన కార్యక్రమంలో జె సి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టడం అన్నది చాలా ముఖ్యమని ఇది మన వ్యక్తిగత ఆర్థిక భద్రతకే కాకుండా, రిటైర్మెంట్ తర్వాత కూడా జీవన భద్రతకూ ఎంతో అవసరమన్నారు. అదే సమయంలో దేశ ఆర్థికాభివృద్ధికి కూడా పెట్టుబడులు ఎంతో తోడ్పడుతుం దన్నారు. కంపెనీలు అభివృద్ధి చెందడానికి పెట్టుబడిదారులే ఆధారమన్నారు. మనం పెట్టుబడి పెడితే కంపెనీలకు మూలధనం లభిస్తుందని,ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగడమే కాకుండా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.తద్వారా ప్రతి పెట్టుబడిదారుడు దేశ ఆర్థిక శక్తిని నిర్మించడంలో భాగస్వామి అవుతారని,ఇది %ాజుదీ×% లక్ష్యాలలో భాగమన్నారు.ప్రతి ఒక్కరూ కనీసం ?1000 రూపాయలు అయినా పెట్టుబడిగా పెట్టడం, లేదా మన పరిధిలో ఉన్న వారిని సురక్షితంగా, సరైన విధంగా పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడం చాలా అవసరమన్నారు. చాలా మందికి పొదుపులు ఉన్నా, వాటిని ఎలా సురక్షితంగా మరియు లాభదాయకంగా పెట్టుబడి పెట్టాలో మార్గదర్శనం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు మరియు నిరంతరం పెట్టుబడి గురించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నందుకు కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సెబి,జనరల్ మేనేజర్ ఎం.కె శ్రీకాంత్ మాట్లాడుతూ.. డబ్బు పోతే మరల సంపాదించుకోవచ్చునని సమయం వృధా అయితే మరల తిరిగి తీసుకురాన్నారు. ఫైనాన్షియల్ ఫ్రీడం ఉండేలా, మనం ఎందులో పెట్టుబడులు పెట్టినా, ఈక్విటీ కాకుండా ఈటిఎఫ్ తదితరాలలో పెట్టుబడులు పెట్టినా మన పెట్టుబడులనేవి కంపెనీలలో పెడితే కంపెనీ అభివృద్ధి చెందుతుందని, నేషన్ గ్రోత్ అవుతుందని జేసీ చెప్పడం జరిగిందన్నారు. దాన్ని రివర్స్ గా ఆలోచించి చూస్తే ఇండియా అభివృద్ధి చెందడంతోపాటు కంపెనీలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని మనం కూడా పెట్టుబడులు పెట్టుంటే మనం అభివృద్ధి చెందే వాళ్ళమన్నారు. బ్యాంకు,పోస్ట్ ఆఫీస్ లలో ఉన్నటువంటి స్కీముల్లో పెట్టబడులు పెడితే మహా అయితే 8 నుండి10% వరకు ఆదాయం వస్తుందన్నారు.సర్వ సాధారణంగా ప్రజలు బంగారం కొనుగోలు చేయడం జరుగుతుందని ,అది వస్తురూపంలో కానీ కాయిన్స్ రూపంలో కానీ కొనుగోలు చేస్తారన్నారు. తద్వారా వాటిపై అమ్మినా,లేక కొనుగోలు చేసినా జిఎస్టి రూపంలో మన నుండి సొమ్మును వసూలు చేస్తారన్నారు. బంగారంలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు భౌతికంగా కొనడం కాకుండాఈటీఎఫ్, సెవేరియన్ బాండ్ల రూపంలో బంగారంపై పెట్టుబడులు పెడితే అప్రిసేషన్, డిప్రిసేషన్ చార్జీలు తగ్గుతాయన న్నారు. ఈ కార్యక్రమం లో స్టాక్స్ మార్కెట్ లో పెట్టుబడులు మరియు టాక్స్ రిలేటెడ్ విషయాలు, పొదుపు పేరుతో మోసం చేసే పథకాలు వాటిపై ఎన్ ఎస్ డి ఎల్ చీఫ్ రెగ్యులేటరీ అధికారి యస్ గ్యానాని, వైస్ ప్రెసిడెంట్ నారాయణ వెంకట్ లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ గా ఎల్డీఎం రవికుమార్ వ్యవహరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కలెక్టరేట్లోని వివిధ శాఖలకు చెందిన హెచ్ఓడిలు పాల్గొన్నారు.

## ఆగస్టు 30, 31వ తేదిల్లో శ్రీ తిరుమలనంబి 1052వ అవతార మహోత్సవాలు

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 21 :** ప్రముఖ వైష్ణవాచార్యులు శ్రీ తిరుమలనంబి 1052వ అవతార మహోత్సవాన్ని ఆగస్టు 30, 31వ తేదీల్లో తిరుమలలోని దక్షిణ మాడ వీధిలో గల శ్రీ తిరుమలనంబి ఆలయం లో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీ తిరుమలనంబి ఆలయంలో 16 మంది ప్రముఖ పండితులు శ్రీ తిరుమల నంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరైన శ్రీ తిరుమలనంబి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తీర్థ కైంకర్యం ప్రారంభించారు. వీరు భగవద్రామానుజుల వారికి స్వయాన మేనమామ, గురుతుల్యులు. వీరు రామానుజుల వారికి రామాయణ పఠనం చేశారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆచార్య పురుషుడిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ తిరుమలనంబికి సంబంధించిన ఒక కథ ప్రచారంలో ఉంది. తిరుమలనంబి శ్రీవేంకటేశ్వర స్వామివారి అభిషేకానికి సంబంధించిన పవిత్రజలాలను తిరుమల ఆలయానికి 8 కి.మీ దూరంలో ఉన్న పాపవినాశనం తీర్థం నుండి తీసుకొచ్చేవారు. ఒకరోజు ఆయన పాపవినాశనం నుండి నీటిని కుండలో తీసుకొస్తుండగా సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామివారు తిరుమలనంబి భక్తిని పరీక్షించాలని భావించి ఒక వేటగాని రూపంలో వచ్చి దాహంగా ఉందని, తాగడానికి నీళ్లు కావాలని ఆడిగారు. ఈ పవిత్రజలాలు స్వామివారి అభిషేకం కోసమని చెప్పి ఇచ్చేందుకు తిరుమలనంబి తిరస్కరించారు. అంతట వేటగాని రూపంలో ఉన్న స్వామివారు రాయి విసిరి కుండకు చిల్లుచేసి నీరు తాగారు. అందుకు తిరుమలనంబి బాధపడుతూ "వయో భారం కారణంగా నేను తిరిగి అంతదూరం పాపవినాశనం వెళ్లి స్వామి వారికి అభిషేకజలం తీసుకురావడం సాధ్యంకాదు, ఈ రోజు నేను స్వామివారికి అభిషేకం చేయలేకపోతున్నా" అని దు:ఖించారు. అంతలో వేటగాని రూపంలో ఉన్న స్వామివారు "చింతించకు తాతా నేను నీ పూజకు తప్పకుండా సహాయం చేస్తా" అని తెలిపి తన చేతిలోని విల్లును ఆకాశంలోనికి ఎక్కుపెట్టి బాణం వదిలారు. వెంటనే వినీలాకాశం నుండి ఉరుకుతూ నీటిధార భూమికి వచ్చింది. "ఇకపై ఈ జలాన్నే నా అభిషేకానికి వినియోగించు" అని ఆ వేటగాని రూపంలో ఉన్న స్వామివారు అదృశ్యమ య్యారు. అప్పుడు తిరుమలనంబి సాక్షాత్తు స్వామివారే బాలుని రూపంలో ప్రత్యక్షమయ్యారని గ్రహించారు. ఆనాటి నుండి నేటి వరకు ఈ తీర్థాన్నే స్వామివారి అభిషేకానికి వినియోగిస్తున్నారు. ఆకాశం నుండి వచ్చినందువల్ల ఈ తీర్థానికి ఆకాశగంగ అని నామధేయం ఏర్పడింది.

## ఆగష్టు 28 నుండి 30 తేదీ వరకు తాళ్లపాక శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు



**అన్నమయ్య పెన్ పవర్ ఆగస్టు 21 :** అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయంలో ఆగష్టు 28 నుండి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు ఘనంగా జరుగను న్నాయి. పవిత్రోత్సవాలకు ఆగష్టు 27న పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సం గ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు. యాత్రీకుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆగష్టు 28న ఉదయం 9 గంటలకు యాగశాల పూజ, చతుష్టార్చన, బింబ, మండల, కుంభ ఆరాధనలు, పవిత్ర ప్రతిష్ట, సాయంత్రం 6 గంటలకు పవిత్రహోమాలు జరుగనున్నాయి. ఆగష్టు 29న ఉదయం 9 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మూలవర్లకు, ఉత్సవర్లకు, పరివార దేవతాలకు పవిత్ర సమర్పణ, సాయంత్రం 6 గంటలకు నిత్య హోమాలు నిర్వహిస్తారు. ఆగష్టు 30న ఉదయం 6 గంటలకు పవిత్ర విసర్జన, పవిత్ర జల ప్రోక్షణ, మహా పూర్ణాహుతి, పవిత్ర వితరణ, సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథలు, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## నాయుడుపేట సాగరమాల రోడ్డు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**నాయుడుపేట, పెన్ పవర్ ఆగస్టు 21 :** నాయుడుపేట సాగరమాల రోడ్డు పనులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సాగర మాల రోడ్డుకు సంబంధించి రైతులకు సర్వీస్ రోడ్డు విషయమై జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలియజేశారు. అలాగే రైతులకు చెల్లించాల్సిన భూ పరిహారం ఇప్పించేలా చూడాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి, నాయుడుపేట తాసిల్దార్ రాజేంద్రకు తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సీఎస్ కాన్ఫరెన్స్





**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 21 :** ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి , ఎంఐ ట్యాంకులు&గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, స్వామిత్వ కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు & అమలు, దిగువ కోర్టులలో ఖాళీగా ఉన్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్. ఈ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ భవనం భూమి పూజ చేసిన కలెక్టర్







**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :** చిత్తూరులోని ఎన్‌పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త హాస్టల్ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చూడ చైర్మన్ కటారి హేమ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## జీవితంలోని భౌతిక వనరులతో మనం నిజంగా హృదయపూర్వకంగా సంతృప్తి చెందుతామా?

**- సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి పెన్ పవర్**



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS


**కడప పెన్ పవర్ ఆగస్టు 21 :** ఆత్మ - సంతృప్తి చెందిన వ్యక్తులు. నేను మా ఊరికి వెళ్లేందుకు బస్టాండ్‌లో వేచి ఉన్నాను. బస్సు ఇంకా రాలేదు. నేను అక్కడ కూర్చుని పుస్తకం చదువుతున్నాను. నన్ను చూసి, దాదాపు 10 సంవత్సరాల వయసు ఉన్న అమ్మాయి నా దగ్గరకు వచ్చి,"సార్, ఈ పెన్నులు కొనుక్కోండి, నేను మీకు నాలుగు పెన్నులు రూ.10కి ఇస్తాను, నాకు చాలా ఆకలిగా ఉంది, నాకు ఏదైనా తినడానికి ఉంటుంది." ఆమెతో పాటు ఒక చిన్న పిల్లవాడు కూడా ఉన్నాడు, బహుశా ఆమె తమ్ముడనుకుంటాను.నేను, "కానీ, నాకు పెన్ను అవసరం లేదమ్మా", అన్నాను. ఆమె తర్వాత చాలా ముద్దుగా ఇలా ??అడిగింది,"అప్పుడు మేము ఏం తింటాం?" "నాకు పెన్ను వద్దు, కానీ నువ్వు తప్పకుండా ఏదోకటి తింటావు" అన్నాను. నా బ్యాగ్ లో రెండు బిస్కెట్ల ప్యాకెట్లు ఉన్నాయి. నేను ఆ రెండు ప్యాకెట్లను తీసి, ఇద్దరికీ చెరొకటి ఇచ్చాను. కానీ ఆమె ఒక ప్యాకెట్ తిరిగి ఇచ్చేసి, "అయ్యగారు! ఒక్కటి చాలు, ఇద్దరం పంచుకుంటాం" అని చెప్పడంతో నేను చాలా ఆశ్చర్యపోయాను. నేను మళ్ళీ " ఫర్వాలేదు, ఈ రెండూ ఉంచుకో " అన్నాను. దానికి ఆ అమ్మాయి అడిగిన ప్రశ్న నన్ను, నా హృదయాన్ని, నా ఆత్మను కూడా కదిలించింది. "అప్పుడు మీరు ఏమి తింటారు?" అని అడిగింది. కోట్లాది కోట్లు సంపాదిస్తున్న మనుషులు మానవత్వాన్ని పక్కనపెట్టి విజయం పేరుతో ప్రజలను విపరీతంగా దోచుకుంటున్న ఈ ప్రపంచంలో, ఆకలితో ఉన్న ఓ అమ్మాయి నాకు మానవత్వపు ఉన్నతమైన పాఠాన్ని నేర్పింది. ఆత్మతో సంతృప్తి చెందేవాళ్ళు ఇలాగే ఉంటారేమో అని నాలో నేనే అనుకున్నాను... దురాశతో వాళ్ళ వంతు కూడా తినేసేంతగా ఎదుటివారి వద్ద నుండి తీసుకోకండి ...!! ఒక ప్రాథమిక సూత్రం ఉంది - తీసుకునే కంటే ఎక్కువగా ఇవ్వండి. ఈ లక్షణాలు ఆధ్యాత్మిక సాధన, స్వీయ అధ్యయనం ద్వారా ఎదిగిన వ్యక్తిలో వ్యక్తమవుతాయి. ??

దాజీజీ

హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం ?

## ఇదీ భగవద్గీత గొప్పదనం.....







**కడప పెన్ పవర్ ఆగస్టు 21 :** భగత్ సింగ్ పట్టుబడ్డాక అతడిని జైలులో వేసారు బ్రిటీషు బ్రీడు వారు! జైలులో గడిపినన్ని రోజులు ఆయన ఉదయం వ్యాయామం చేసేవాడు! తెల్లవారు జామున చలికి సైతం వణకకుండా వ్యాయామం చేసేవాడు! అది చూసి తెల్లవారు ఆశ్చర్యపోయేవారు! మిగతా ఖాళీ సమయంలో భగవద్గీత చదివేవాడు! రోజు కొంత బాగం భగవద్గీత చదివాక, ఎంత వరకు చదివాడో అక్కడ పేజీని మడిచి అక్కడి బ్రిటీష్ కాపలాదారునికి ఇచ్చేవాడట! అలా కొన్ని రోజుల తరువాత భగత్ సింగ్ ని ఉరి తీసే రోజు రానే వచ్చింది! ఉరి తీసే కొన్ని గంటల ముందు రోజూ లాగే భగవద్గీత చదివి, ఎక్కడి వరకు చదివాడో



అక్కడ పేజీని మడిచి ఆ కాపలాదారునికి ఇచ్చాడు! అది చూసిన ఆ తెల్ల కాపలాదారుడు ఆశ్చర్యంతో... "అదేంటి? నువ్వు బతికున్నన్ని రోజులు ఈ పుస్తకం ఎంత వరకు చదివావో అక్కడ పేజీని మడతేసి నాకు ఇచ్చావు సరే! కానీ, ఇప్పుడు నిన్ను మా ప్రభుత్వం ఉరి తీస్తుంది! ఇంకా పేజీని మడతేసి ఇవ్వడం దేనికి?" అని ఉత్సూకతగా అడిగాడు! భగత్ సింగ్ మాత్రం ఎలాంటి భయం, ఆందోళన లేకుండా స్థిత ప్రజ్ఞతతో... " ఇది మాములు పుస్తకం కాదు!మనిషికి కావాల్సిన నిజమైన సంపద, ఏ దేశం వాడు దోచుకుపోలేన్నిన బంధారం అంతా ఇందులోనే ఉంది! మీ ప్రభుత్వం ఈ శరీరానికి శిక్ష వేసింది! కానీ, నా ధర్మం ప్రకారం నేను చేసింది నేరం కాదు! ఎవరు నమ్మినా, నమ్మకున్నా ప్రతీ ఒక్కరిపైనా కర్మ బలంగా పని చేస్తుంది! ఒకవేళ మీరు నాకు ఉరి వేసాక ఈ శరీరాన్ని నేను విడవచ్చు కానీ, నా ఈ జన్మ సంస్కారం నన్ను వదిలిపోదు! నేను ఎక్కడైతే చదవడం ఆపేసానో, ఖచ్చితంగా మరో జన్మలో నేను చదవడం ఆపిన దగ్గరి నుండి మళ్ళీ చదువుతాను! అలా ఏదో ఒక జన్మలో పూర్తి యోగ సాధనలో పరమాత్ముడిని చేరుకుంటాను!" అని ధైర్యంగా సమాధానమిచ్చాడు!" ఈ సమాధానం విన్న ఆ కాపలాదారుడు భగత్ సింగ్ ఆత్మ విశ్వాసానికి మరింతగా ఆశ్చర్యపోయాడు...

## స్వర్ణముఖి బ్యారేజ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్





వాకాడు, పెన్ పవర్ ఆగస్టు 21 : వాకాడు మండలం లోని స్వర్ణముఖి బ్యారేజ్ ను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇరిగేషన్ ఎస్ ఈ రాధాకృష్ణ, ఈ ఈ బాబు తో కలిసి సందర్శించిన జిల్లా కలెక్టర్. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలోని గూడూరు నియోజకవర్గం లో గల స్వర్ణముఖి నది మీద ఉన్నటువంటి స్వర్ణముఖి డైవర్షన్ బ్యారేజ్ ను ఎస్.ఈ మరియు బ్యారేజ్ డీ.ఈలు, గూడూరు సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించడం జరిగిందన్నారు.ఈ బ్యారేజ్ ను 2005 లో నిర్మించడం జరిగిందని సుమారు 20 సంవత్సరాల నుండి తీర ప్రాంతానికి దగ్గరగా ఉన్నందున చాలావరకు రోజువారి నిర్వహణ లోపించడంతో గత కొన్ని సంవత్సరాలుగా వరద ముంపు నిర్వహణ లేకపోవడం వల్ల అదే విధంగా ఇక్కడున్న వాతావరణ పరిస్థితుల వల్ల చాలా వరకు బ్యారేజ్ లో ఉన్నటువంటి ఇనుప పరికరాలు అన్ని కూడా త్రుప్పు పట్టడం వల్ల రెగ్యులర్ ఆయిల్, గ్రీసింగ్ చేయకపోవడం వల్ల చాలా ఇబ్బందులు అయితే ఉన్నాయని అన్నారు. దీని కింద ఆయకట్టు సుమారుగా కోటా, వాకాడు మండలాలలో ఉన్నాయని వాకాడు మండలంలో 9500 ఎకరాలు, కోట మండలంలో 300 ఎకరాలు మొత్తంగా 10 వేల ఎకరాలు దీని కింద ఆయకట్టు ఉందని అన్నారు. 10 కాస్కేడింగ్ చెరువుల ద్వారా ఈ ఆయకట్టు కు నీటిని సప్లై చేస్తున్నామని అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు గంగ నీరు కూడా బ్యారేజ్ లోనికి వదిలి ఖరీఫ్ పంటకు కూడా వచ్చేల చేస్తూ తద్వారా ఈ ఆయకట్టు కింద ఉన్న రైతులందరికీ సారవంతమైన నేలలు ఉన్నందున కూడా రెండు పంటలు ఖరీఫ్, రబీ లు వచ్చే విధంగా చర్యలు తీసుకు వస్తున్నామన్నారు.

ఈ బ్యారేజ్ మరమ్మతులకు 3 కోట్లు అవసరమని అన్నారు. సంవత్సరానికి 10 నుండి 12 లక్షలు నిర్వహణ కు ఖర్చవుతుందని దీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. మరమ్మత్తులకు అవసరమైన 3 కోట్లను ప్రభుత్వానికి నివేదించామని వచ్చే సంవత్సరంలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయకట్టు కింద 10 వేల ఎకరాలు ఉంది కనుక రైతులు ఆందోళన చెందకుండా ఆయకట్టును పరిరక్షించడానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఎస్.ఈ , రైతులు ఫ్లడ్ బ్యాంక్ కూడా చాల వరకు కోతలకు గురైందని తమ దృష్టికి తీసుకొచ్చారని ప్రభుత్వానికి నివేదించామని అన్నారు.

## ఆరు జట్లు, మూడు పోటీలు..
## రసవత్తరంగా సాగిన రెండవ రోజు మ్యాచ్‌లు



**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 21 :** ధర్మవరం పట్టణంలోని ఆర్డిటి మైదానంలో జరుగుతున్న అటల్ బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలు రెండవ రోజు గురువారం హోరాహోరీగా సాగాయి. మొత్తం మూడు ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో ఆరు జట్లు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించాయి. ఈ మ్యాచ్‌లను ప్రారంభించేందుకు బీజేపీ నాయకులు హాజరై జట్లకు ప్రోత్సాహం అందించారు. మొదటి మ్యాచ్‌లో గొట్లూరు వాల్మీకి లెవెన్స్ జట్టు మరియు జై శ్రీరామ్ జై హనుమాన్ జట్ల మధ్య ఉత్కంఠభరిత పోరు జరిగింది. ఈ మ్యాచ్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షులు చంద్ర టాస్ వేసి ప్రారంభించారు. సమన్వయంగా ఆడిన జై శ్రీరామ్ జై హనుమాన్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఈ మ్యాచ్‌లో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రహ్లాద్ రెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. రెండవ మ్యాచ్‌లో ఫ్రెండ్స్ లెవెన్స్ మరియు సన్‌రైజర్స్ లెవెన్స్ జట్ల మధ్య కఠినమైన పోరు సాగింది. ఈ మ్యాచ్‌ను బీజేపీ నాయకులు అంబటి సతీష్ మరియు గుండా పుల్లయ్య టాస్ వేసి ప్రారంభించారు. గట్టి పోరాటంలో ఫ్రెండ్స్ లెవెన్స్ జట్టు దూకుడు ప్రదర్శించి 31 పరుగుల తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. అద్భుతమైన బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలను ప్రదర్శించిన మంజునాథ్ ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మూడవ మ్యాచ్‌లో సచిన్ లెవెన్స్ మరియు లక్ష్మీ నరసింహ అగ్రహారం లెవెన్స్ జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌ను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భక్తవత్సలం నాయుడు మరియు నారా కొండయ్య చౌదరి టాస్ వేసి ప్రారంభించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో లక్ష్మీ నరసింహ అగ్రహారం లెవెన్స్ జట్టు 31 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అద్భుత ప్రదర్శనతో వెంకటేష్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. గురువారం జరిగిన ఈ మూడు మ్యాచ్‌లలో ఆటగాళ్ల ప్రతిభ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రహ్లాద్ రెడ్డి, మంజునాథ్, వెంకటేష్ తమ అద్భుత ప్రదర్శనలతో జట్ల విజయాల్లో కీలకపాత్ర పోషించారు. టోర్నమెంట్‌ను మరింత ప్రతిష్ఠాత్మకంగా మార్చేందుకు బీజేపీ నాయకులు, క్రీడాభిమానులు విస్తృత సహకారం అందిస్తున్నారు. రెండవ రోజు మ్యాచ్‌లు



విజయవంతంగా ముగియడంతో రేపు జరిగే మూడవ రోజు పోటీలు మరింత ఉత్కంఠభరితంగా సాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, మంత్రి కార్యాలయ సిబ్బంది, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబిలేసు, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబాటు సతీష్, పట్టణ అధ్యక్షులు చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు భక్తవత్సలం నాయుడు, శ్యామ్ రావు, పోతుకుంట రాజు, జూటూర్ వెంకటేష్, నారా కొండయ్య చౌదరి, గుండా పుల్లయ్య, సోమ్లా నాయక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అక్రమ రవాణాపై అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 21 :** నంద్యాల జిల్లాకు మంజూరైన రాయితీ యూరియా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు అక్రమ రవాణా జరగరాదని... ఇందుకు అవసరమైన పటిష్ట నిఘా మరియు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని తన ఛాంబర్ నందు యూరియా అక్రమ రవాణాపై వ్యవసాయ శాఖ, పోలీస్, సివిల్ సప్లై, ఇండస్ట్రీస్, విజిలెన్స్, జెడి పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ బోర్డ్ అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... రైతు బాగుంటే రాష్ట్రం, దేశం బాగుంటుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రైతులు వేసే పంటలకు సరిపడే రాయితీ యూరియా వారికి అందించడం జరుగుతుంద న్నారు. నంద్యాల జిల్లాలో కొంతమంది... రైతులకిచ్చే రాయితీ యూరియాను దారి మళ్లించి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తు న్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్యను పూర్తిగా నివారించేందుకు సంబంధిత అధికారులు అందరూ ప్రత్యేక చర్యలు తీసుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇచ్చే రాయితీ యూరియా పంట పొలాలకు మాత్రమే వాడాలని, యూరియాను ఇతర అవసరాలకు ఉపయోగించడం మంచిది కాద న్నారు. నంద్యాల పట్టణంలో రాయితీ యూరియాను వివిధ రకాల పరిశ్రమలైన పౌల్ట్రీ ఫీడ్, క్యాటిల్ ఫీడ్, ఆల్కహాల్, ప్లై వుడ్ ఇండస్ట్రీస్, ప్లేట్, వస్త్ర పరిశ్రమ మరియు సోప్స్ తయారీ వంటి అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇలా చేయడం వల్ల రైతులకు యూరియా సమస్య తలెత్తే అవకాశం ఉందని ఇకనుంచి ఇలాంటి కార్యక్రమాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యూరియా అక్రమ రవాణా నివారణకు సంబంధించి మండల స్థాయిలో ఒక టీం వేసి ఇన్స్పెక్షన్ చేసి రెండు రోజులలో తమకు నివేదిక అందజేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఎక్కడ కూడా యూరియా సమస్య తలెత్తకూడదని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నా లోపల ఏ మార్పులు తెచ్చుకోవాలని అనుకుంటున్నాను

**- డాక్టర్ సునీత..**





**కన్వ పెన్ పవర్ ఆగస్టు 21 :** లోతైన ధ్యానం చేయాలి: ధ్యానం సమయంలో నిజంగా ఆ వెలుగులో మునిగిపోవాలి. ఇది నా అంతర కలుషాలను నివారించే ఔషధం అవుతుంది. ఇతరులను విమర్శించడం మానాలి: ఇతరుల తప్పులను ఎత్తి చూపటం కంటే నా లోపాలను సరిచేసుకోవడంపై దృష్టి పెట్టాలి. వినయాన్ని పెంపొందించుకోవాలి: నిజమైన ఆధ్యాత్మిక పురోగతి స్వీయ సవరణతోనే మొదలవుతుందని అంగీకరించి, అంతఃకరణ వినయాన్ని పెంచుకోవాలి. ప్రతి ఒక్కరిలో మంచి చూడాలి: ఇతరులలోని మంచితనాన్ని చూడటం అలవాటు చేసుకోవాలి. ఇది నిజమైన ప్రేమను పెంచుతుంది. మాటల్లో జాగ్రత్త వహించాలి: నా మాటలు ఎవరి హృదయాన్నైనా గాయపరచకుండా, ప్రోత్సహించేలా ఉండేలా కృషి చేయాలి. అంతర సమత ఉంచాలి: ఆధ్యాత్మిక మార్గం అంటే స్వీయ పోరాటం అని గుర్తు పెట్టుకుని, నా హృదయ పవిత్రత నా ప్రతి కార్యంలో ప్రతిబింబించాలి.

## తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువకు సంబంధించిన మేజర్ కాలువను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



**చిట్టుమూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :** చిట్టుమూరు మండలంలోని తెలుగు గంగ 7 వ బ్రాంచ్ కాలువకు సంబంధించిన మేజర్ కాలువను జిల్లా కలెక్టర్ గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇరిగేషన్ ఎస్ ఈ రాధాకృష్ణ తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ కెనాల్ కింద ఆయకట్టు 5500 ఎకరాలు కలదని ఈ కెనాల్ కు సంబంధించిన భూసేకరణ కు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని తెలిపారు.

## పాల్యం ఎస్టీ కాలనీ నందు మెడికల్ క్యాంపును పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :** జిల్లాలో ఈరోజు 600మందిగిరిజనులకు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా వివిధ పరీక్షలు నిర్వహించడం జరిగిందని జిల్లా సంయుక్త కలెక్టర్ జి విద్యాధరి పేర్కొన్నారు. గురువారం పెనుమూరు మండలంలోని

చిప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పాల్యం ఎస్టి కాలనీ నందు ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును సంయుక్త కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని ఎస్టీ జనాభా నివాస ప్రాంతాల్లో చిత్తూరు, విజయపురం, పెనుమూరు, నింద్ర, కె.నగర్, యాదమరి, గంగవరం, పెద్ద పంజాని, శాంతిపురం, సోమల మండలాల్లో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగింది ఇందులో ఎస్టీ జనాభాకు ఆరోగ్య సేవలు రక్త పరీక్ష, మూత్ర పరీక్ష, బిపి, షుగర్, ఈసీజీ, హెచ్ బి, కిడ్నీ పరీక్ష, మలేరియా, డెంగు, సికిల్ సెల్ అనీమియా పరీక్ష, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. సుమారు 600 మంది గిరిజనులకు వివిధ పరీక్షలు నిర్వహించడం జరిగింది, ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది . పాల్యం ఎస్టీ కాలనీ నందు 56 మందికి వివిధ పరీక్షలు నిర్వహించడం జరిగింది. మొత్తం 56 అవుట్ పేషెంట్లకు 329 వైద్య పరీక్షలు నిర్వహించారని అందులో 17 మంది ఈసీజీ, 54 మంది హిమోగ్లోబిన్, 54 మంది ఆర్ బి ఎస్, 54 మంది బిపి, 17 మంది టీబీ, 29 మంది సికిల్ సెల్ స్క్రీనింగ్, 26 మంది సి బి సి, 26 మంది ఎల్ ఎఫ్ టి, 26 మంది ఆర్ ఎఫ్ టి, 26 మంది సిరాలజీ పరీక్షలు చేయించుకున్నారని జిల్లా సంయుక్త కలెక్టర్ కి వైద్య సిబ్బందితెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై స్పష్టమైన నివేదికలు

**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :** స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై కేపిఐసి 95% వివరాలను వెబ్ సైట్ లో పొందుపరిచామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఏపీ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ దృష్టికి తీసుకు వెళ్లారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర, జల శక్తి మిషన్, స్వామిత్వ, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ప్రభుత్వ సేవలు-ప్రజాభిప్రాయంపై సిఎస్ సమీక్షించారు. స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై స్పష్టమైన నివేదికలను పంపామని జిల్లా కలెక్టర్ వివరించారు. క్షేత్ర స్థాయిలోని అంశాలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఎక్కడ సమస్యలు ఉత్పన్నంకాకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. స్వామిత్వ సర్వే గ్రామాల్లో జరుగుతుందన్నారు, గ్రామ కంఠం ఆధారంగా సర్వే పక్కాగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి. విద్యాదరి, డ్వామా పిడి, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు...

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 21 :** సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. గురువారం కృష్ణగిరి మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హాజరు పట్టికను పరిశీలిస్తూ, సిబ్బంది హాజరు తో పాటు వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను త్వరితగతిన అందించాలని, అలసత్వం వహించకూడదన్నారు... ప్రజలకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.. ప్రతి రోజు సేవలకు సంబంధించి ఎన్ని గ్రీవెన్స్ లు వస్తున్నాయని, ఇప్పటివరకు ఈ క్రాప్ బుకింగ్ ఎంత మేరకు పూర్తి చేశారని కలెక్టర్ సచివాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎంపిడిఓ మోహన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికులు, వీర నారీల పెన్షన్, కుటుంబ ఆర్మీ రికార్డు ఆఫీసుల ద్వారా చర్యలు

### జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్పలి



**అనంతపురము,పెన్ పవర్ ఆగస్ట్ 21 :** ఉమ్మడి అనంతపురము జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వీర నారీల పెన్షన్, కుటుంబ సభ్యుల పేర్ల సవరణ పార్ట్ 2 ఆర్డర్ అంశాలపై సంబంధిత రెజిమెంట్ ఆర్మీ రికార్డు ఆఫీసుల ద్వారా వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు మద్రాస్ రెజిమెంట్ లో పని చేసి రిటైర్ అయిన మాజీ సైనికులు, యుద్ధవీరుల వీర నారీల సమస్యల పరిష్కారం కోసం మద్రాస్ రెజిమెంట్ (వెల్లింగ్టన్) ఆర్మీ రికార్డ్ ఆఫీసు అధికారులు గురువారం నాడు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన అవుట్రీచ్ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప మాట్లాడుతూ మాజీ సైనికులు, వీర నారీల సమస్యలపై తాము జిల్లా సైనిక్ బోర్డు నుంచి ఆర్మీ రికార్డ్ ఆఫీసులకు పంపుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఇంకా వేగవంతంగా చర్యలు చేపట్టాలని ఆర్మీ అధికారులను కోరారు. ఈ అంశంపై మద్రాస్ రెజిమెంట్ రికార్డ్ ఆఫీసు ఆర్మీ అధికారులు మంచి చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరిస్తున్నారని, గత సంవత్సరం మాదిరి ఈ సంవత్సరం కూడా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అవగాహన మరియు పరిష్కార సమావేశం నిర్వహించడం పట్ల జిల్లా సైనిక సంక్షేమ అధికారి అభినందించారు. నార్పల కు చెందిన గాండ్ల లీలావతి భర్త వరికుంట్ల వెంకట సుబ్బయ్య గత డిసెంబర్ లో జమ్ము కాశ్మీర్ లోని మన దేశ సరిహద్దుల్లో సైనిక విధులు నిర్వహిస్తూ అమరులయ్యారని, సదరు అమర జవాన్ కు సంబంధించి మద్రాస్ రెజిమెంట్ మరియు ఆర్. ఆర్. రెజిమెంట్ల నుండి క్యాజువాలిటీ క్లాసిఫికేషన్ రికార్డ్ లు ఇంకా జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయానికి పంపలేదని, ఈ అంశంపై ఇదివరకే మూడు లేఖలు వ్రాశామని, త్వరగా పంపాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప మరియు వీర జవాన్ వరికుంట్ల వెంకట సుబ్బయ్య భార్య వీర నారి గాండ్ల లీలావతి మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ రికార్డ్ ఆఫీసు అధికారులకు విజ్ఞప్తి చేయగా, సదరు అమర జవాన్ రికార్డులను ఆర్మీ హెడ్ క్వార్టర్స్ కు పంపామని త్వరలో వస్తాయని మద్రాస్ రెజిమెంట్ రికార్డు అఫీసు నుండి వచ్చిన సుబేదార్ దొడ్డ రమేష్ , హవల్దార్ క్లర్క్ అనీష్ లు వివరించారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ లో దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన గోరంట్ల కల్లి తండా అగ్నివీర్ మూడ్ మురళి నాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున యాభై లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని, 5 ఎకరాల భూమి, 300 గజాల ఇంటి స్థలాన్ని మురళి నాయక్ తల్లితండ్రులకు ఇటీవల బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ అందజేశారని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిధులు దాదాపు 14 లక్షలతో మురళి నాయక్ సమాధిని నిర్మించారని, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మంజూరు చేసిన రూ. 16 లక్షలతో మురళి నాయక్ సమాధి వరకు సిసి రోడ్డును కూడా నిర్మించారని తిమ్మప్ప తెలిపారు. అలాగే, మాజీ సైనికుల భూముల సమస్యల పరిష్కారం కోసం అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ లు చాలా సానుకూలంగా స్పందించి ఎప్పటికపుడు సమస్యలను పరిష్కరిస్తున్నారని, పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో స్పర్ష్ ఉచిత కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేశామని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప కోరారు. అదేవిధంగా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు మాజీ సైనికులు, వీర నారీల కోసం ఇటీవల నూతనంగా ప్రారంభించిన వీర నారీ పరివార్ సహాయతా యోజన పథకం కింద స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు అనంతపురము జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురము జిల్లా మాజీ సైనికులు, వీర్ నారీలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు లీగల్ సర్వీసెస్ క్లినిక్ ను జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆగస్టు 15 న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీ ఈ. భీమరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ మరియు సివిల్ జడ్జి శ్రీ ఎన్. రాజశేఖర్ లు ప్రారంభించారని, ప్రతి వర్కింగ్ శనివారం ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్ ద్వారా ఉచిత న్యాయ సేవలను అడ్వకేట్ శశికళ, పేరా లీగల్ శంకర్ ద్వారా అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప కోరారు. అనంతరం, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అమర్ నాథ్ లాల్, మద్రాస్ రెజిమెంట్ రికార్డ్ ఆఫీసు నుండి వచ్చిన ఆర్మీ అధికారులు సుబేదార్ దొడ్డ రమేష్, హవల్దార్ క్లర్క్ అనీష్, హవల్దార్ ప్రతాప్ రెడ్డి లు మద్రాస్ రెజిమెంట్ కు సంబంధించి వచ్చిన 13 మంది మాజీ సైనికులు, 7 మంది వీర నారీలకు సంబంధించిన అర్జీలను తీసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను పరిష్కరించడం పట్ల మాజీ సైనికులు, వీర నారీలు హర్షం వ్యక్తం చేశారు.

## కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ డేటా అప్లోడ్‌ని 25వ తేదీలోపు పూర్తి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం,పెన్ పవర్ ఆగస్టు 21 :** ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి, ఎంఐ ట్యాంకులు&గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, స్వామిత్వ కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు&అమలు, దిగువ కోర్టులలో ఖాళీగా ఉన్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ జిల్లాలో కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ కి సంబంధించిన డేటా అప్లోడ్ ని 25వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 45 శాఖల నుంచి 300 ఇండికేటర్స్ కి సంబంధించి డేటా పారదర్శకంగా సేకరించి అప్లోడ్ చేస్తామని తెలిపారు. ఆయా శాఖల పరిధిలో సానుకూల ప్రజా దృక్పథంకు సంబంధించి మరింత పురోగతి తీసుకురావాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ అశోక్ కుమార్, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, హౌసింగ్ పిడి శైలజ, ఐసిడీఎస్ పిడి నాగమణి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, మైన్స్ డిడి ఆదినారాయణ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, సర్వే ఏడి రూప్లనాయక్, డిపిఓ నాగరాజునాయుడు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎవరి ఆజ్ఞ ప్రకారం సూర్యుడు ప్రతీరోజూ తన నిర్ణీత సమయానికి ఉదయిస్తాడు

### ఎవరి ఆజ్ఞ ప్రకారం మన హృదయం ఎడతెగకుండా కొట్టుకుంటూ ఉంటుంది ...? : దైవాజ్ఞ.. సమ్మిరెడ్డి సింధు







**కడప పెన్ పవర్ ఆగస్టు 21 :** ఒకప్పుడు ఒక చాలా పేద స్త్రీ ఉండేది. ఆమెకు దైవిక శక్తి మీద అపారమైన నమ్మకం, బలమైన విశ్వాసం ఉండేది. ఒకసారి, చాలా రోజులుగా కుటుంబ సభ్యులందరికీ తినడానికి ఏమీ లభించని భయంకరమైన పరిస్థితి వచ్చింది. ఒక రోజు, తనకు సహాయం చేయమని కోరుతూ రేడియో కార్యక్రమం ద్వారా భగవంతునికి ఆమె ఒక సందేశాన్ని పంపింది. అందరితో పాటు ఈ ప్రసారాన్ని ఒక పారిశ్రామికవేత్త కూడా విన్నారు, అతను తన సంపద చూసుకుని గర్వపడేవాడు, పైగా అతను నాస్తికుడు కూడా. ఈ స్త్రీకి భగవంతునిపై ఉన్న విశ్వాసం దెబ్బతినేలా ఒక చిలిపి పని చేద్దామని అనుకున్నాడు. అతను తన సెక్రటరీతో ఇలా చెప్పాడు," ఈ స్త్రీ ఇంటికి వెళ్లి, పుష్కలంగా ఆహారం, ఒక నెలకి సరిపడా సరుకులు పంపిణీ చేయండి. ఎవరు పంపారు అని ఆమె అడిగితే, 'దెయ్యం' ఇదంతా పంపించిందని చెప్పండి." సెక్రటరీ అన్ని వస్తువులతో అక్కడకు చేరుకోగానే, ఆమెకు ఆ మహిళ కృతజ్ఞతలు తెలిపింది. అపారమైన కృతజ్ఞతతో, ??మొదట ఆమె కుటుంబం ఆహారం తిన్నారు. తర్వాత సరుకులు మొత్తం అల్మారాలో సర్దడం ప్రారంభించింది. ఇదంతా ఎవరు పంపారు అని ఆ మహిళ అడగకపోగా, సెక్రటరీ ఆగలేక, ఇలా ప్రశ్నించింది, "మీ కోసం ఇవన్నీ ఎవరు పంపారో తెలుసుకోవాలన్న ఆత్రుత మీకు లేదా?" దానికి ఆ మహిళ ఒక అద్భుతమైన సమాధానం ఇచ్చింది,"నేను ఎందుకు అంత ఆలోచించాలి? ఎందుకు అడగాలి?, నాకు భగవంతునిపై పూర్తి విశ్వాసం ఉంది, నా భగవంతుడు ఆజ్ఞ ఇస్తే, దెయ్యాలు కూడా ఆ ఆజ్ఞను పాటించాల్సిందే". సాక్షాత్కార మార్గంలో సులభమైన విజయ సాధనకు దృఢనిశ్చయం, నమ్మకం, విశ్వాసం ఇవన్నీ ప్రాథమిక అంశాలు.

బాబూజీజి

హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం

## హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సేవలు చిరస్మరణీయం

### - రీజినల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి



**రాజమండ్రి పెన్ పవర్ ఆగస్టు 21 :** విజయవాడ నగరంలో జరిగిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ డాక్టర్ తాళ్లూరి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసిన మొదలు నిరంతరము అవిశ్రాంతంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కుటుంబ సభ్యులందరూ తొమ్మిది సంవత్సరాలు పాటు నిరంతర కృషితో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య, గుండెకు సంబంధించిన, సేవలందించే మన హ్యూమన్ రైట్స్ సభ్యులను గురించి కొనియాడారు, అలాగే జిల్లాల వారీగా రాష్ట్రాల వారీగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సేవలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాయలసీమ జిల్లాలలో ఆరోగ్య కేంద్రాల, వివిధ పాఠశాలల తనిఖీ, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు మన సంస్థ ముందు ఉండడం గర్వకారణం అని, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సేవల్లో భాగముగా మానసిక వికలాంగులను గుర్తించి, సరియైన వైద్యం అందించి, నిరాధారణకు గురి అయిన వారిని వివిధ ఆశ్రమాలలో చేర్పించి, అనాధలకు ఆపద్బాంధవుడుగా నిలిచే హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ రీజినల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి అవిశ్రాంత సేవలు చిరస్మరణీయమని రాయలసీమ చైర్మన్ నేసే జాన్ పాల్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అలాగే విద్యార్థిని విద్యార్థులకు అండగా ఉంటూ కడప అన్నమయ్య జిల్లాలలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి మన్నలను పొందిన చైర్మన్ డాక్టర్ కళ్యాణ్ రాజ్ గురించి కొనియాడారు. సభలో జిల్లాల వారీగా సేవలు అందించిన వారికి మేమెంటో మరియు ప్రశంసా పత్రాలతో జాతీయ చైర్మన్ తాళ్లూరి ప్రసన్న కుమార్ స్వహస్తాలతో, గౌరవించి అభినందించడం జరిగినది. ఈ కార్య క్రమంలో జాతీయ చైర్మన్ తో పాటు, వివిధ రాష్ట్రాలలో ఉన్న మన కుటుంబ సభ్యులు, లీగల్ చైర్మన్, తెలంగాణ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమహిళ చైర్మన్, అత్యధికంగా రాయలసీమ జిల్లాల నుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.








## ముక్తికి మార్గదర్శకత్వం : సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి



**కడప పెన్ పవర్ ఆగస్టు 11 :** వ్యక్తి మరణించిన తర్వాతనే సాంప్రదాయ మతం ముక్తిని ప్రసాదిస్తుందని అనిపిస్తుంది.దీనినే 'విదేహముక్తి' అని అంటారు అంటే జీవి శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాతే ఈ ముక్తి కలుగుతుంది.కానీ జీవించి ఉండగానే ముక్తిని పొందే జీవన్ముక్తి స్థితి అనేది చాలా ఉన్నత స్థాయికి చెందిన ముక్తి అని అంటారు ఇది బహు కొద్ది మందికి మాత్రమే లభిస్తుంది కానీ ఈ జన్మలోనే ఇప్పుడే ఇక్కడే గృహస్తినిగా జీవితం సాధిస్తూ ఉండగానే ముక్తిని పొందటం ముఖ్యమని సహజమార్గ పద్ధతి చెబుతోంది మాస్టర్ గారు తన వద్ద గలదివ్య శక్తిని, అనంతశక్తిని ప్రయోగించి అభ్యాసి లో మార్పు తీసుకువస్తారు అబ్యాసి నిద్రణంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తుల్ని మేల్కొల్పడానికి ఈ శక్తిని వినియోగిస్తారు. ఈ పద్ధతిని నిర్మలీకరణ ప్రక్రియతో జోడించి భౌతిక శరీరంలోని అణువు అణువును చేదిస్తూ తిరిగి దానిని పునర్ నిర్మిస్తూ నెమ్మది నెమ్మదిగా చివరకు భౌతికత ఏమాత్రం లేకుండా చేస్తూ క్రమంగా పరివర్తన కలుగజేస్తారు చూడడానికి అన్ని కార్యాచరణ ప్రయోజనాలకు అది భౌతిక శరీరం గానే కనిపిస్తూ ఉంటుంది ఆ విధంగానే పనిచేస్తూ ఉంటుంది కానీ నిజానికి అది ఇప్పుడు ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక శరీ రం అటువంటి పవిత్రమైన శరీరం పంచ కోశాలకు అతీతమైనది అని అంటారు అటువంటి శరీరం మాత్రమే ముక్తిని పొందిన ఆత్మ యొక్క శరీరం కాగలదు. నా మాస్టర్ గారి మార్గదర్శకత్వంలో ఈ స్థితిని సాధించిన వారికి అలాంటి శరీరం ఉందని చెప్పవచ్చు ముక్తి నొందిన ఆత్మ ఆధ్యాత్మికత్వాన్ని దివ్యత్వాన్ని పొందిన శరీరాన్ని కలిగి ఈ భూమిపై జీవించవలసినంత కాలం జీవిస్తూ ఉంటుంది. మాస్టర్ ప్రసాదించే ముక్తి అలాంటిది ముక్తి పొందడానికి మనము చనిపోయే వరకు వేచి ఉండాల్సిన పనిలేదు. ఇతర పద్ధతులలో ఆత్మకు వాహనంగా గల శరీరం విముక్తాత్మను తనలో ఉంచుకునేందుకు తగినంత పవిత్రతను దివ్యత్వాన్ని కలిగి ఉండదు కాబట్టి ఆయా పద్ధతులలో ముక్తి కొరకు ఆ వ్యక్తి మరణించే వరకు ఆ ఆత్మ వేచి ఉండాల్సి వస్తుంది కానీ నా మాస్టర్ గారు స్థూల శరీరాన్ని అణు స్థాయిలో పునర్నిర్మానం చేసి సరికొత్త ఆధ్యాత్మిక శరీరంగా రూపొందించగలరు ఆయన తన ప్రాణాహుతి శక్తితో ఈ విధంగా చేయగలరు ( నా గురువర్యులు పేజీ నెం.178)





## "ఇది ప్రజాస్వామ్యమా? లేక బీజేపీ నియంతృత్వమా?" : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ జ్యోతి



**కడప పెన్ పవర్ ఆగస్టు 21 :** ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు మరియు మంత్రులను తీవ్రమైన ఆరోపణలపై అరెస్టు చేస్తే వారిని పదవుల నుండి తొలగించడానికి ప్రతిపాదించబడిన చట్టం ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి తప్ప మరొకటి కాదు.కాంగ్రెస్ పార్టీ ఈ నియంతృత్వ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు మనకు చెప్పినట్టుగానే, చట్టం పేరుతో నియంతృత్వం రాబోతోందని ఆయన హెచ్చరించారు. నేడు బీజేపీ అదే చేస్తుంది.బి జె పి ప్రభుత్వం బి ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తుంది. బిజెపి ప్రభుత్వం వాళ్ల ఇష్టానుసారంగా భారత రాజ్యాంగాన్ని రూపుమాపుతున్నారు.ఇది పూర్తిగా అప్రజాస్వామికం. మన ప్రజాస్వామ్యంలో, "దోషిగా నిరూపించబడే వరకు నిర్దోషి" అనే సూత్రం న్యాయానికి పునాది. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం. మేము ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక అరాచక పాలనలో ఉన్నామా అనే విధంగా బిజెపి పాలన ఉంది.ఈ బిల్లు న్యాయం గురించి కాదు, ఇది రాహుల్ గాంధీ వంటి నాయకులను లక్ష్యంగా చేసుకోవడం మరియు ఎన్నికైన ప్రభుత్వాలను బలహీన పరచడం గురించి.కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి క్రూరమైన చర్యలను వ్యతిరేకిస్తుంది మరియు నిరంకుశ పాలన నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంది.కాంగ్రెస్ కు పెరుగుతున్న బలం మరియు పొందుతున్న ప్రజల మద్దతును చూసి బిజెపి భయపడుతుంది. అందుకని బిజెపి ఇటువంటి చట్టాలను తీసుకొని వస్తుంది. రాబోయే ఎలక్షన్స్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కచ్చితంగా ప్రధానమంత్రి అవుతారు మరియు ఇటువంటి నిరంకుశ పాలనను అంతమొందిస్తారని కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్ డి విజయ జ్యోతి అన్నారు.



కర్నూలు నగరంలో పౌర సరఫరాల సంస్థ ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య.

## పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### పదవ తరగతి ఉన్నత విద్యకు పునాది : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 21 :** పదవ తరగతిలో ఉత్తీర్ణత ఉన్నత విద్యకు పునాది అని, పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం కృష్ణగిరి మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ముందుగా టీచర్లతో సమావేశం అయ్యారు..బోధన ఎలా చేస్తున్నారు, ఎంత మంది ఉపాధ్యాయులున్నారు అని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు.. హాజరు పట్టికను పరిశీలించారు..21 మంది సిబ్బంది ఉన్నారని, కంప్యూటర్ టీచర్, లైబ్రేరియన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్ట్ లు ఖాళీ గా ఉన్నాయని ప్రిన్సిపల్ తెలిపారు..ఈ పోస్టులను భర్తీకి ఉన్నతాధికారులకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ డీఈఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు..పదవ తరగతిలో గత ఏడాది 86 శాతం ఉత్తీర్ణత సాధించారని, 14 శాతం ఎందుకు సాధించలేపోయాం అని విశ్లేషించుకుని, ఈ ఏడాది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా దృష్టి పెట్టాలన్నారు..ఏ సబ్జెక్ట్ లో ఎక్కువ ఫెయిల్ అయ్యారో, ఆ సబ్జెక్ట్ మీద స్పెషల్ ఫోకస్ పెట్టాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించారు.. గుడ్లపై రంగులు లేకపోవడంతో ఎందుకు రంగులు లేవని అధికారులను ప్రశ్నించారు..మోడల్ స్కూల్ లకు సరఫరా చేసే గుడ్ల కు రంగులు ఉండవని ఉపాధ్యాయులు వివరించారు.. గుడ్ల సైజ్, నాణ్యత ను మండల విద్యా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో సంభాషించారు.. బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు.. పదవ తరగతి లో ఉత్తీర్ణత ఉన్నత విద్యకు పునాది వేస్తుందని, మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మలా కుమారి, ఎం ఈ వో మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో యూరియా పంపిణీపై తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 21 :** జిల్లాలో యూరియా పంపిణీ లో అక్రమాలు జరగకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రం లో రైతులకు యూరియా పంపిణీ పై జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు.. గ్రామానికి ఇప్పటి వరకు ఎంత యూరియా వచ్చింది, రైతులకు ఎలా పంపిణీ చేశారు అని రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు..ఆన్లైన్ వివరాలతో పాటు ఆఫ్లైన్ లో ఏ రైతుకి ఎంత ఇచ్చారు అని వివరాలను రిజిస్టర్ లో ఎంట్రీ చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.....ఇంకా ఎంత మేరకు యూరియా అవసరం ఉందని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారిని ఆరా తీశారు .. 300 బ్యాగ్ ల యూరియా ఈ గ్రామానికి అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. యూరియా వచ్చిన వెంటనే ఈ గ్రామానికి 300 బ్యాగ్ లు పంపించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు... యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు సజావుగా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.. ఇప్పటివరకు మండలంలో ఎంత మేరకు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేశారని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారిని ఆరా తీశారు.. మండలంలో 2 వేల ఎకరాల వరకు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి అయిందని, ప్రతి రోజు ఒక వ్యక్తికి 50 ఎకరాల మేరకు ఈ క్రాప్ బుకింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ అధికారి వివరించారు.. సెప్టెంబర్ 15 వ తేది నాటికి ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా , తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరుపతిలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పర్యటన

### రాయలసీమ జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో ప్రాంతీయ సదస్సులో పాల్గొననున్న మంత్రి డా.స్వామి

**అమరావతి, పెన్ పవర్ ఆగస్టు 21 :** (22.08.2025) తిరుపతిలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పర్యటించనున్నారు. ఉదయం 10.30 గం.ల నుంచి మ.2.30 గం.లకు వరకు కచ్చపి ఆడిటోరియంలో ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించే రీజనల్ కాన్సరెన్స్ లో మంత్రి పాల్గొంటారు. అనంతరం మ. 3 గం.లకు బైరాగి పట్టెడలో నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రారంభిస్తారు.

# కోర్టు ఏం చెబుతుందో చూద్దాం: కేసీఆర్‌పై సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహారశైలిని నిశితంగా గమనించాలని, ఆయన ఎలాంటి అడుగులు వేస్తున్నారు? ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు? అనే విషయాలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ టీంను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఇచ్చిన నివేదిక ను సవాల్ చేస్తూ.. మాజీ సీఎం హైకోర్టును ఆశ్రయించారు. కేసీఆర్ సహా.. అప్పటి జలవనరులశాఖ మంత్రి హరీష్‌రావులు ప్రత్యేకంగా వేర్వేరు పిటిషన్లు వేశారు. అసలు ఘోష్ కమిషనే రాంగ్ అన్నది పిటిషన్లలో వారు పేర్కొన్న కీలక విషయం.

ఈ పిటిషన్లను బుధవారం సాయంత్రం హైకోర్టులో దాఖలు చేయగా.. గురువారం ఉదయం రిజిస్ట్రీ వీటికి నెంబర్లు కేటాయించారు. అనంతరం.. సాయంత్రం ఈ పిటిషన్లపై హైకోర్టు గురువారం విచారణ చేపడుతుందని రిజిస్ట్రీ ప్రకటించారు. దీంతో ఈ వ్యవహారంపై నిశితంగా దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి లీగల్ టీంకు సూచించినట్టు సమాచారం. "ఆయనకు ఉన్న స్వేచ్ఛ ఆయనకు ఉంటుంది. మీరు నిశితంగా గమనించండి. హైకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇస్తుందో.. ఎలాంటి ఆదేశాలు చేస్తుందో.. అసలు ఏం చెబుతుందో కూడా వినండి. తర్వాత.. మనం ఒక నిర్ణయానికి వద్దాం." అని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పినట్టు సమాచారం.అయితే.. జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికే కొట్టి వేయాలని మాజీ సీఎం కేసీఆర్ హైకోర్టును కోరడం గమనార్హం. తమ విజ్ఞాపనలు, విన్నపాలను పరిగణనలోకి తీసుకోకుండా.. రాజకీయ ప్రేరేపిత కుట్రలో భాగంగానే ఈ కమిషన్ విచారణ సాగిందన్నది ఆయన పేర్కొన్న విషయం. అంతకాదు.. విధానపరమైన నిర్ణయాలను సమీక్షించే అధికారం కోర్టులకు కూడా లేనప్పుడు.. కమిషన్‌కు ఎలా ఉంటుందని కూడా ప్రత్యేక ప్రశ్నను కేసీఆర్ లేవనెత్తారు. ఈ పరిణామాల క్రమంలో హైకోర్టు వ్యవహరించే తీరు, అసలు కమిషన్ రిపోర్టుపై ఎలాంటి నిర్ణయం వెలువరిస్తుంది..? అనేవి ఆసక్తిగా మారాయి.

**నిర్ణయం తేడా కొడితే!**

త్వరలోనే తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికను సంక్షిప్తీకరించి 65 పేజీల్లో రూపొందించిన నివేదికను సభలో ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీనికి అన్నీ సమా యత్తం కూడా చేసుకుంటున్నారు. తద్వారా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో వ్యవహరించిన తీరును సభాముఖంగానే తెలంగాణ సమాజానికి వివరించాలన్నది ఆయన ప్రయత్నం. అయితే.. ఇప్పుడు హైకోర్టులో అసలు కమిషన్ రిపోర్టునే రద్దు చేయాలని కేసీఆర్ ప్రధానంగా కోరడం.. దీనికి హైకోర్టు కనుక సానుకూలంగా స్పందిస్తే.. రేవంత్ నిర్ణయం తేడా కొడుతుంది. అయినప్పటికీ.. వేరే రూపంలో దీనిపై చర్చ పెట్టే దిశగా కూడా ప్రభుత్వం సమాయత్తం అవుతోంది.

# వీసా-గ్రీన్ కార్డ్ కోసం 'యాంటీ-అమెరికన్' టెస్ట్..భారతీయుల్లో ఆందోళన




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా వీసా, గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఇకపై కొత్త నిబంధనలు ఎదురుకానున్నాయి. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వలస విధానాలను మరింత కఠినతరం చేస్తూ కొత్తగా 'యాంటీ-అమెరికన్ టెస్ట్' పేరుతో ఒక నిబంధనను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం వీసా లేదా గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసే వ్యక్తులు అమెరికా వ్యతిరేక భావజాలం కలిగి ఉన్నారా లేదా అనే అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

**సోషల్ మీడియా పోస్టులపై కఠిన నిఘా**

ఈ కొత్త విధానంలో భాగంగా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను నిశితంగా పరిశీలించాలని అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అధికారులకు సూచించింది. సోషల్ మీడియాలో అమెరికా వ్యతిరేక పోస్టులు, వ్యాఖ్యలు లేదా ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయని అనుమానించినా దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉంది. ఈ "యాంటీ-అమెరికన్" కార్యకలాపాలు అభ్యర్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. USCIS ప్రతినిధి మాథ్యూ ట్రాజెసర్ మాట్లాడుతూ "అమెరికా ప్రయోజనాలు ఈ దేశాన్ని ద్వేషించే వారికి ఇవ్వలేం. వలస ప్రయోజనాలు హక్కు కాదు, ప్రత్యేక అవకాశం మాత్రమే" అని స్పష్టం చేశారు. ఈ ప్రకటన అమెరికా వలస విధానాలపై ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తుంది.

**భారతీయుల ఆందోళన**

ఈ కఠిన నిబంధనలు వేలాదిమంది భారతీయ విద్యార్థులు, ఐటీ నిపుణులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 6,000 మందికి పైగా విద్యార్థుల వీసాలను అమెరికా రద్దు చేసింది. దీనికి తోడు ఈ కొత్త నిబంధనలు భారతీయ దరఖాస్తుదారులపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఈ విధానంపై విమర్శలు కూడా పెరుగుతున్నాయి. ఈ కఠిన నిబంధనల వల్ల అమెరికాకు రావాలనుకునే ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులు వెనకడుగు వేసే అవకాశం ఉందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వీసా ఆంక్షలతో భయాందోళనలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, ఈ కొత్త 'యాంటీ-అమెరికన్' స్క్రీనింగ్‌తో మరింత ఆందోళన చెందుతున్నారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు, పరిశోధనలకు అవసరమైన మానవ వనరుల లభ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 'ఫిక్స్‌డ్ టర్మ్ వీసా'.. అమెరికా కొత్త విద్యార్థి వీసాల నిబంధన



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో విదేశీ విద్యార్థులకు నిబంధనలు కఠినతరం చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టింది. గతంలో వలసలను నియంత్రించేందుకు తీసుకువచ్చిన అనేక నిర్ణయాల మాదిరిగానే, ఇప్పుడు విద్యార్థి వీసాలపై కూడా కొత్త ఆంక్షలు విధించాలని యోచిస్తోంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ఇటీవల ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. దీని ప్రకారం ప్రస్తుతం ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానానికి బదులుగా విద్యార్థులకు 'ఫిక్స్‌డ్ టర్మ్ వీసా' విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించింది.

**ప్రస్తుత విధానం: 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్'**

ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, విద్యార్థులు F-1 వీసాపై అమెరికాకు వెళ్ళిన తర్వాత తమ కోర్సు పూర్తయ్యేంత వరకు చట్టబద్ధంగా అక్కడ ఉండవచ్చు. చదువు ఎంతకాలం సాగినా, కోర్సు పూర్తి అయ్యేంత వరకు వీసా గడువు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దీనివల్ల విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా తమ చదువుపై దృష్టి పెట్టగలుగుతున్నారు.

**కొత్త ప్రతిపాదనలో మార్పులు: 'ఫిక్స్‌డ్ టర్మ్ వీసా'**

కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థి వీసాలకు ఒక నిర్దిష్ట గడువు ఉంటుంది. అంటే చదువు కొనసాగుతున్న మధ్యలోనే వీసా గడువు ముగిసిపోవచ్చు. ఈ సందర్భంలో విద్యార్థులు తమ వీసాను మధ్యలోనే పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ముఖ్యంగా పీహెచ్‌డీ (%లాష్ట్రణ%).. పరిశోధన రంగాలలో ఉన్న విద్యార్థులకు తీవ్రమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. థీసిస్ సమర్పణలో ఆలస్యం, ల్యాబ్ వర్క్ జాప్యం లేదా ఇతర అనుకోని పరిస్థితుల వల్ల చదువు ఎక్కువ కాలం పడితే, వీసా రెన్యూవల్ తప్పనిసరి అవుతుంది.

**భారతీయ విద్యార్థులపై ప్రభావం**

ప్రస్తుతం అమెరికాలో దాదాపు 4.2 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ కొత్త ప్రతిపాదన వారిపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. వీసా పునరుద్ధరణ కోసం అదనపు ఖర్చులు, సమయంతో పాటు, పత్రాల సమర్పణ వంటి ప్రక్రియలు చదువులో అంతరాయం కలిగించవచ్చు. ఇది విద్యార్థులకు ఆర్థికంగానూ భారంగా మారవచ్చు.

**గతంలోనూ జరిగిన ప్రయత్నం**

ఇలాంటి ప్రతిపాదనను ట్రంప్ ప్రభుత్వం 2020లోనే తీసుకురావడానికి ప్రయత్నించింది. అప్పుడు విద్యార్థి వీసాలకు గరిష్టంగా 2 నుంచి 4 సంవత్సరాల వరకు మాత్రమే గడువు పెట్టాలని భావించారు. కానీ, విద్యార్థులు మరియు విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత కారణంగా ఈ ప్రతిపాదనను ఆపివేయాల్సి వచ్చింది.

**విద్యార్థులు ఏం చేయాలి?**

ఈ ప్రతిపాదన ఇంకా తుది నిర్ణయం కానప్పటికీ, విద్యార్థులు ముందుగానే సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. వీసా పునరుద్ధరణ ఖర్చులు.. సమయాన్ని తమ ఆర్థిక ప్రణాళికలో చేర్చుకోవాలి. చదువు ఆలస్యమయ్యే అవకాశాలపై తమ అకాడెమిక్ అడ్వైజర్లతో చర్చించి తగిన సలహాలు తీసుకోవాలి. పబ్లిక్ కామెంట్ ప్రాసెస్ లో పాల్గొని ఈ ప్రతిపాదనపై తమ అభిప్రాయాలను తెలియజేయాలి.

ఈ కఠినమైన వీసా

నిబంధనలు అమలులోకి వస్తే అమెరికా విద్యార్థుల గమ్యస్థానంగా కొనసాగుతుందా లేదా ఇతర దేశాల వైపు విద్యార్థులు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి.

# తమిళ రాజకీయాల్లో భారీ సంచలనం.. దళపతి విజయ్ సెన్సేషన్



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళ సూపర్ స్టార్, టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు దళపతి విజయ్ కీలక ప్రకటన చేశారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న దళపతి విజయ్ తాను మధురై నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ రోజు అక్కడ నిర్వహించిన బహిరంగ సభ తమిళ రాజకీయాల్లో పెద్ద సంచలనంగా మారింది. లక్షల మంది అభిమానులు తరలిరావడతో మధురైలో టీవీకే సభ విజయవంతంమైనట్లు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికలు అధికార డీఎంకే పార్టీకి టీవీకే మధ్యే జరగనుందని ఆ పార్టీ అధిపతి విజయ్ ప్రకటించారు. దక్షిణ భారత్ లో అత్యధిక ప్రేక్షకాదరణ కలిగిన హీరోగా విజయ్ కు గుర్తింపు ఉంది. ఇక గత కొన్నేళ్లుగా తమిళనాడులో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విజయ్.. గత ఏడాది సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించారు. తమిళనాడులోని రెండు ప్రధాన రాజకీయ పక్షాలకు సమదూరం పాటిస్తూ తానే ఒక రాజకీయ శక్తిగా ఎదగాలని విజయ్ వ్యూహం రచిస్తున్నారు. దీంతో ఎప్పటికప్పుడు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తూ బలప్రదర్శనకు దిగుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

ఈ నేపథ్యంలో గురువారం మధురైలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనూహ్యంగా లక్షల మంది జనం హాజరయ్యారు. ఎటు చూసినా అభిమానుల సందడితో సభా ప్రాంతం ఒక జన సముద్రాన్ని తలపించిందని చెబుతున్నారు. ఈ అభిమాన జనం ఓట్ల రూపం తీసుకుంటే విజయ్ ఒక బలమైన శక్తిగా ఆవిర్భవించడం ఖాయమంటూ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సభకు వచ్చిన జనాన్ని చూసి విజయ్ కూడా ఆశ్చర్యపోయినట్లు చెబుతున్నారు.

ఇక సభలో విజయ్ మాట్లాడుతూ, తమిళనాడులో అధికార డీఎంకే తన రాజకీయ విరోధిగా ప్రకటించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని భావజాల శత్రువుగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేతోనే పోటీ అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపు తట్టి వచ్చే ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనను ఎంతగా విమర్శిస్తే, అంతగా ఎదుగుతానని ప్రత్యర్థులను హెచ్చరించారు.

తమిళనాడులో ప్రధాన నగరమైన మధురై నుంచి తాను పోటీ చేయనున్నట్లు వెల్లడించిన విజయ్.. మధురై ఈస్ట్ నుంచి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కుల, మతాల తనకు ముఖ్యం కాదని, తమిళుడికే ప్రాధాన్యమిస్తానని తెలిపారు. బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ ముందు మనం ఎందుకు తల వంచాలని ప్రశ్నించారు. సీఎం స్టాలిన్ ఢిల్లీలో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్టాలిన్ పాలనలో మహిళలకు రక్షణ లేకపోయిందని ధ్వజమెత్తారు. కాగా, 2024లో టీవీకేను స్థాపించగా, తొలి బహిరంగ సభ గత ఏడాది విల్లుపురంలో నిర్వహించారు. తాజాగా నిర్వహించిన సభతో విజయ్ సరికొత్త రికార్డు నెలకొల్పారని అంటున్నారు.

# 2036 ఒలింపిక్స్ భారత్ లోనే?




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే క్రీడా టోర్నీల్లో రారాజు ఒలింపిక్స్. ప్రపంచ దేశాలన్ని పాల్గొనే ఈ భారీ కార్యక్రమాన్నినిర్వహించటం అంత తేలికైన విషయం కాదు. ఈ క్రీడా పండుగకు భారీ ఎత్తున పోటీ నెలకొని ఉంటుంది. దాదాపు పదేళ్లకు ముందే దీనికి సంబంధించిన కసరత్తు షురూ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఒలింపిక్స్ క్రీడల్ని నిర్వహించే అంశంపై పెద్దగా ఫోకస్ పెట్టని భారత సర్కారు.. గడిచిన కొంతకాలంగా ఈ అంశంపై ప్రత్యేక ఆసక్తిని ప్రదర్శిస్తోంది. ఇందుకు తగ్గట్లే అంతర్జాతీయంగా మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తోంది.

ఈ క్రమంలో 2036లో గుజరాత్ రాష్ట్ర రాజధాని అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగా ఈ భారీ క్రీడల నిర్వహణ చేపట్టాలని మోడీ సర్కారు భావిస్తోంది. ఎన్డీయే ప్రభుత్వంలో అత్యంత కీలక స్థానాల్లో ఉన్న మోడీషాల స్వరాష్ట్రంలోనే ఒలింపిక్స్ వేడుకల్ని నిర్వహించేందుకు వీలుగా ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన బిడ్డింగ్ లోనూ ప్రభుత్వం పాలు పంచుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి వేళ.. ఒక సానుకూల సందేశం భారత్ కు అందింది.

ఒలింపిక్స్ టోర్నీని రెండుసార్లు విజయవంతంగా నిర్వహించి.. ముచ్చటగా మూడోసారి నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకుంటున్న ఆస్ట్రేలియా.. ఈ మెగా టోర్నీ నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాల్ని భారత్ కు అందిస్తామని చెప్పటం ఆసక్తికరంగా మారింది.

2032 ఒలింపిక్స్ కు ఆస్ట్రేలియా వేదిక కానుంది. ఆ తర్వాత జరిగే ఒలింపిక్స్ క్రీడలు భారత్ కు వేదికగా మారితే.. దీనికి సంబంధించిన ఏ అంశంలో అయినా తమ సహాయ సహకారాల్ని అందించేందుకు తాము సిద్ధమని పేర్కొంది. భారీ క్రీడా సంగ్రామం నిర్వహణలో నమ్మకమైన భాగస్వామిగా ఉంటామన్న హామీ ఇచ్చిన ఆస్ట్రేలియా.. ఈ మేరకు రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగవుతాయని భావిస్తోంది. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ఈ ప్రకటన నేపథ్యంలో 2036లో ఒలింపిక్స్ నిర్వహణకు మంచి మిత్రుడు అండ దొరికినట్లుగా చెప్పాలి. పెద్ద టోర్నీలు ఎలా నిర్వహించాలన్నది భారత్ కు తెలిసినప్పటికి.. ఒలింపిక్స్ అందుకు కాస్త భిన్నమైనదన్న విషయాన్ని మర్చిపోకూడదు.

ఏకంగా ఒలింపిక్స్ గ్రామాన్నే నిర్మించాల్సి ఉంటుంది. దీనికి తోడు స్టేడియం నిర్మాణం.. మార్కెటింగ్.. సెక్యూరిటీ.. టికెట్ల అమ్మకం.. క్రీడాకారుల సౌకర్యాలు ఇలా ఎన్నో అంశాలు ఉంటాయి. వీటి విషయంలో ఆస్ట్రేలియాకు ఉన్న అనుభవం ఎక్కువ. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ క్రీడా స్టేడియం డిజైన్ నను ఆస్ట్రేలియా సంస్థే డిజైన్ చేసింది. ఈ నేపథ్యంలో పాత బంధం.. రానున్న రోజుల్లో ఒలింపిక్స్ నిర్వహణకు సాయం చేసే వీలు ఉంటుంది. తాజాగా వచ్చిన ఆస్ట్రేలియా ప్రకటన నేపథ్యంలో 2036లో అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్స్ జరిగే అవకాశాలు మరింత మెరుగు కావటమేకాదు.. ప్రభుత్వం ఈ అంశంలో ఎంత సీరియస్ గా ఉందన్న విసయం అర్థమవుతుందని చెప్పక తప్పదు

## ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్‌కు గ్రీన్ సిగ్నల్..
## ద్వైపాక్షిక సిరీస్‌కు నో ఛాన్స్: క్రీడా మంత్రిత్వ శాఖ




**హైదరాబాద్ పెన్ పవర్:** యూఏఈ వేదికగా ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆసియా కప్ మ్యాచ్ జరుగుతుందా లేదా అనే విషయంలో సస్పెన్స్ తొలగింది. పాకిస్తాన్‌తో జరిగే ద్వైపాక్షిక సిరీస్ లకు భారత ప్రభుత్వం స్పష్టంగా నిరాకరించింది. అయితే ఆసియా కప్, ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్ తో భారత్ మ్యాచ్ లు ఆడుతుందని స్పష్టం చేసింది. "ఒకరి దేశంలో జరిగే ద్వైపాక్షిక మ్యాచ్ ల విషయానికి వస్తే భారత జట్టు పాకిస్థాన్ కు వెళ్ళదు. అదే విధంగా పాకిస్థాన్ ఇండియాకు రావడానికి అనుమతి లేదు. అయితే బహుళ జట్లు ఆడే టోర్నీలో మాత్రం పాకిస్థాన్ తో ఇండియా ఆడుతుంది". అని క్రీడా మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది.

క్రికెట్ విషయానికొస్తే.. ఆతిథ్య దేశంతో సంబంధం లేకుండా రెండు జట్లు తటస్థ వేదికలలో ఆడేందుకు ఇండియా, పాకిస్థాన్ అంగీకరించాయి. దీని ప్రకారం యూఏఈలో ఆసియా కప్ జరగనుండడంతో ఒకరి దేశానికీ మరొకరు వెళ్లే అవసరం లేదు. రెండు జట్లు కూడా దుబాయ్ వేదికగా జరగబోయే తటస్థ వేదికపై ఆడడం కన్ఫర్మ్ అయిపోయింది. మొదటగా ఆసియా కప్ కు ఇండియా ఆతిథ్య మిచ్చిన ఆ తర్వాత యూఏఈకి మార్చబడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా ఇండియా, పాకిస్థాన్ దుబాయ్ వేదికగా తలపడ్డాయి.

క్రికెట్‌లో ఇండియా - పాకిస్థాన్ మ్యాచ్ కు ఉండే క్రేజ్ వేరే. మరే మ్యాచుకు ఉండని ఆదరణ దాయాదుల పోరుకు ఉంటుంది. టెస్ట్, వన్డే, టీ20 ఫార్మాట్ ఏదైనా సరే.. ఇండియా, పాక్ జట్లు తలపడుతున్నాయంటే ఈ రెండు దేశాల క్రికెట్ ఫ్యాన్సే కాకుండా.. యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ప్రియులు ఈ మ్యాచ్ కోసం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. ఇలాంటి పోరే మరికొన్ని రోజుల్లో జరగబోతుంది. సెప్టెంబర్ 14 న దుబాయ్ వేదికగా ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆసియా కప్ జరగనుంది. రెండు జట్లు ఫైనల్ కు వస్తే మూడు మ్యాచ్ లు చూసే అవకాశం కలుగుతుంది. కొంతకాలంగా పహల్గాంలో మారణహోమం

సృష్టించినా కూడా పాకిస్తాన్?తో ఆసియా కప్?లో కూడా భారత్ ఆడకూడదనే డిమాండ్స్ రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. పలువురు మాజీ క్రికెటర్లు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాకిస్తాన్?తో ఎక్కడ ఎప్పుడు పోటీ పడ్డ భారతే గెలుస్తుందని.. అందులో డౌటే లేదని.. కాకపోతే ఇటీవల ఇరుదేశాల చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఆసియా కప్?లో పాక్?తో మ్యాచ్ ఆడొద్దని బీసీసీఐకి సూచిస్తున్నారు. వరల్డ్ ఛాంపియన్ షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో పాకిస్థాన్ ఛాంపియన్స్ పై ఇండియా ఛాంపియన్స్ రెండు మ్యాచ్ లు ఆడకుండా లీగ్ మధ్యలోనే వైదొలిగింది.

# గిల్‌కు ఎంత కష్టమొచ్చింది.. బిజీ షెడ్యూల్‌తో టీమిండియా కెప్టెన్‌కు వింత సమస్య



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ లో గిల్ వేగంగా దూసుకెళ్తున్నాడు. కోహ్లీ తర్వాత ఈ యువ బ్యాటర్ శకం మొదలైనట్టే కనిపిస్తోంది. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ లో కెప్టెన్ గా, బ్యాటర్ గా గిల్ అద్భుతంగా రాణించాడు. ఫ్యూచర్ లో అన్ని ఫార్మాట్లకు గిల్ కెప్టెన్ అని స్పష్టంగా తెలుస్తోంది. ఆసియా కప్ టీ20 జట్టుకు వైస్ కెప్టెన్ గా ప్రకటించడంతో ఏడాది తర్వాత అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. ఓ వైపు టెస్ట్ క్రికెట్ లో తొలి సిరీస్ లోనే సత్తా చాటడం.. వన్డేల్లో దాదాపు 60 యావరేజ్ తో టాప్ బ్యాటర్ గా దూసుకెళ్లడం.. టీ20 ఫార్మాట్ లో జరగనున్న ఆసియా కప్ కు వైస్ కెప్టెన్ కావడం ఒక్కసారిగా గిల్ టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయాడు. ప్రస్తుతం టీమిండియాలో మూడు ఫార్మాట్ లు ఆడుతున్న లిస్ట్ చూస్తే వారిలో ఇద్దరే ఉన్నారు. వారిలో ఒకరు ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కాగా.. మరొకరు టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్. అక్షర్ పటేల్ ఉన్నప్పటికీ యత్నము విదేశీ టెస్టులకు ఎంపిక చేయరు. అన్ని ఫార్మాట్ లు ఆడడం గిల్ కు కాస్త ఇబ్బంది కలిగించే విషయమే. ఇదిలా ఉంటే ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరుగుతుంది. స్థాయికి తగ్గట్టుగా ఆడితే ఇండియా ఫైనల్ కు రావడం చాలా ఈజీ. ప్రస్తుతం భారత జట్టును ఓడించే ఆసియా దేశం లేనట్టే కనిపిస్తోంది. అయితే ఆసియా కప్ తర్వాత భారత జట్టు స్వదేశంలో వెస్టిండీస్ తో టెస్ట్ సిరీస్ ఆడుతుంది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు ఇండియాలో రెండు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆసియా కప్ కు విండీస్ తో సిరీస్ కు మధ్య కేవలం మూడు రోజుల గ్యాప్ మాత్రమే ఉంది. గిల్ టెస్ట్ జట్టుకు కెప్టెన్ కావడంతో ఖచ్చితంగా సిరీస్ ఆడాలి. బుమ్రా ఆసియా కప్ ఆడినా ఆ తర్వాత జరగబోయే వెస్టిండీస్ సిరీస్ కు పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని రెస్ట్ ఇవ్వనున్నారు. కానీ గిల్ కు మాత్రం ఆ అవకాశం లేదు. సెప్టెంబర్ 28 న ఫైనల్ మ్యాచ్ ఆడితే 29న దుబాయి నుంచి భారత జట్టు ఇండియాకు వస్తుంది. 30న అహ్మదాబాద్ చేరుకోవాల్సి ఉంది. అక్టోబర్ 1న టెస్ట్ సిరీస్ కు సిద్ధమవ్వాలి. అక్టోబర్ 2 న తొలి టెస్ట్ ఆడాలి. అంటే గిల్ కు కనీసం ఇంటి దగ్గర ఒక్క రోజు కూడా ఉండే ఛాన్స్ లేదు. వెస్టిండీస్ తో భారత్ రెండు టెస్టులు ఆడనుంది. అక్టోబర్ 2 నుంచి 6 వరకు తొలి టెస్ట్ మ్యాచ్.. అక్టోబర్ 10 నుంచి 14 వరకు రెండో టెస్ట్ జరుగుతుంది. తొలి టెస్టుకు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం ఆతిథ్యమిస్తుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో రెండో టెస్ట్ జరుగుతుంది. మ్యాచ్ భారత కాలమాన ప్రకారం ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతుంది. జడేజా, సుందర్, కుల్దీప్ యాదవ్ ఉండడంతో టీ20 జట్టులో ఉన్న అక్షర్ పటేల్ ను టెస్ట్ సిరీస్ కు ఎంపిక చేయకపోవచ్చు. మొత్తానికి బుమ్రా, అక్షర్ పటేల్ కు రెస్ట్ ఇచ్చే అవకాశాలు ఉన్నా గిల్ మాత్రం ఖచ్చితంగా ఆడాలి.

## అలాంటి ఆశ లేదు.. కనీసం ఇండియా స్క్వాడ్‌లో చోటివ్వండి: స్టార్ క్రికెటర్ తండ్రి ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2025 కోసం ప్రకటించిన టీమిండియా స్క్వాడ్ లో స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ కు చోటు దక్కపోవడం దురదృష్టకరం. అయ్యర్ ను ఎంపిక చేయకపోవడంపై చాలానే విమర్శలు వచ్చాయి. ఐపీఎల్ 2025 సీజన్ లోపంజాబ్ కింగ్స్ తరపున 600 పైగా పరుగులు చేయడంతో కెప్టెన్సీలో సత్తా చాటి జట్టును ఫైనల్ కు చేర్చాడు. మిడిల్ ఆర్డర్ లో అత్యంత ప్రమాదకర బ్యాటర్. అయినప్పటికీ అయ్యర్ కు 15 మంది స్క్వాడ్ లో స్థానం దక్కలేదు. అయ్యర్ ను ఎంపిక చేయకపోవడంపై అతని తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. తన కొడుకును పక్కన పెట్టినందుకు తీవ్ర నిరాశకు గురయ్యాడు.శ్రేయాస్ అయ్యర్ తండ్రి మాట్లాడుతూ.." శ్రేయస్ భారత టీ20 జట్టులోకి రావడానికి ఇంకా ఏమి చేయాలో నాకు తెలియడం లేదు. అతను ఢిల్లీ క్యాపిటల్స్ నుండి కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల తరపున నిలకడగా రాణించాడు. కెప్టెన్‌గా ఐపీఎల్‌లో అద్భుతంగా జట్టును నడిపిస్తున్నాడు. ప్రతి ఏడాది బెటర్ గా ఆడుతున్నాడు. 2024లో కేకేఆర్ జట్టుకు కెప్టెన్ గా ఐపీఎల్ టైటిల్ అందించాడు. ఈ ఏడాది పంజాబ్ ను ఫైనల్ కు చేర్చాడు. నేను అతన్ని ఇండియా కెప్టెన్‌గా చేయమని చెప్పడం లేదు. కనీసం జట్టులోకి అయినా అతన్ని ఎంపిక చేసుకోండి. జట్టు నుండి తొలగించినా.. అయ్యర్ తన ముఖంలో నిరాశ చూపించడు. ఇది తన అదృష్టమని.. అందుకు మనం ఏమీ చేయలేమని అంటాడు. ఎల్లప్పుడూ కూల్ గా ప్రశాంతంగా ఉంటాడు. శ్రేయాస్ ఎవరినీ నిందించడు కానీ లోపల సహజంగానే నిరాశ ఉంటుంది". అని అయ్యర్ తండ్రి తన అసంతృప్తి తెలిపాడు. శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై స్పందించిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్.. ఎవరి ప్లేస్‌ను అతను భర్తీ చేస్తాడో చెప్పాలని ఎదురు ప్రశ్నించాడు. 'ఎవరి ప్లేస్‌లో శ్రేయస్‌ను తీసుకోవాలి. ఇందులో అతని తప్పు లేదు. మా తప్పు కూడా లేదు. ప్రస్తుతానికి 15 మందిని ఎంపిక చేయాలి. జట్టు అవసరాలను బట్టి ప్లేయర్లను తీసుకున్నాం. కాబట్టి అవకాశం కోసం శ్రేయస్ వేచి చూడాల్సిందే' అని చీఫ్ సెలెక్టర్ స్పష్టం చేశాడు.



అక్షర గౌడ ఫ్యాషన్ సీక్రెట్స్

# #King100.. టెన్షన్ తీరింది





అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

అక్కినేని నాగార్జున వందో సినిమా కోసం అభిమానులు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నారు. ఇదిగో అదిగో అంటున్నారు కానీ.. ఎంతకీ ఆ సినిమా మొదలు కావట్లేదు. మోహన్ రాజా సహా వేర్వేరు దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. పక్కకు వెళ్లిపోయాయి. చివరికి తమిళ దర్శకుడే అయిన రా.కార్తీక్ అనే యంగ్ టెక్నీషియన్‌తో నాగ్ జట్టు కట్టబోతున్నట్లు కొన్ని నెలల ముందే వార్తలు వచ్చాయి. కానీ ఇతనైనా ఖాయమేనా అని నాగ్ ఫ్యాన్స్ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ నాగ్.. కార్తీక్‌తో ట్రావెల్ చేస్తున్న మాట వాస్తవమే అని తర్వాత క్లారిటీ వచ్చింది.

ఐతే కార్తీక్ తొలి సినిమా 'ఆకాశం' క్లాస్‌గా ఉంటుంది. అలాంటి సినిమా తీసిన దర్శకుడు నాగ్ వందో సినిమాను డైరెక్ట్ చేయడం ఏంటి అనుకున్నారు అభిమానులు. వందో సినిమా అంటే మాస్, యాక్షన్‌తో భారీగా ఉండాలన్నది వారి ఆశ. ఇదిలా ఉంటే.. తమిళ హిట్ మూవీ 'అయోత్తి'ని నాగ్‌తో కార్తీక్ రీమేక్ చేస్తున్నాడనే వార్తలు వారిలో మరింత గుబులు పుట్టించాయి. 'అయోత్తి' మంచి సినిమానే అయినా అందులో హీరోయిజం ఏమీ ఉండదు. మరీ సింపుల్ స్టోరీ. నాగ్ వందో సినిమాగా చేయాల్సిన కథ ఇది ఎంతమాత్రం కాదు. ఐతే నాగార్జున తాజాగా జగపతి బాబు నిర్వహిస్తున్న టీవీ షోలో పాల్గొని తన వందో సినిమా మీద క్లారిటీ ఇచ్చేశాడు. అభిమానుల టెన్షన్ తీర్చేశాడు. కార్తీక్‌తో తాను చేయబోయేది రీమేక్ కాదు, ఒరిజినల్ స్టోరీనే అని ఆయన సంకేతాలు ఇచ్చారు. అది గ్రాండియర్ ఉన్న సినిమా అని, భారీ యాక్షన్ ఉంటుందని.. దాంతో పాటే ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్లూ ఉంటాయని స్పష్టం చేశాడు. దీంతో కార్తీక్ తన తొలి సినిమా తరహా కథతో నాగ్ దగ్గరికి రాలేదని.. అది రీమేక్ కూడా కాదని.. మైల్ స్టోన్ మూవీ స్థాయికి తగ్గట్లే భారీగానే ఏదో చేయబోతున్నారని అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 29న నాగ్ పుట్టిన రోజు నాడు ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఆ రోజు నాగ్ చేయబోయేది ఎలాంటి కథ అన్నది మరింత క్లారిటీ రావచ్చు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com